సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
సోమవారం, 01.06.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 220
పేజీలు: 08 వెల: రూ. 5

## దేశ చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



- ఇందిరమ్మ ఇళ్లతో దేశానికి తెలంగాణ మార్గదర్శకం
- రెండు నెలల్లో మరో రెండు లక్షలు పూర్తి

03

# సర్కార్ 'దొడ్డిదారి' కోతలు!

## నిబంధనలు లేవు, ఆమోదం లేదు

- ఉద్యోగుల వైద్య పథకం పేరిట డబ్బులు కట్
- భార్యాభర్తలిద్దరికీ డబ్బులు కట్
- ఆసుపత్రులతో కాని ఒప్పందం
- ప్రభుత్వం తీరుపై మండిపడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి... అన్న చందంగా ఉంది ప్రభుత్వం తీరు. గతంలో ఉద్యోగులకు ఆరోగ్య పథకం పేరిట ఉన్న విధానానికి బదులు కాంట్రిబ్యూటరీ ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు సంబంధించి వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపింది. ఈ చర్చల్లో కొన్ని అంశాలపై సూత్రప్రాయంగా అంగీకారం జరిగింది. కాని విధి విధానాలకు సంబంధించి అంగీకారం జరగకుండానే ఉద్యోగుల వేతనం నుంచి పథకానికి సంబంధించి డబ్బులు కోత ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే గతంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమల్లో ఉండేది. ఇందులో భాగంగా ఉద్యోగులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు నెట్వర్క్ ఆసుపత్రులకు వెళితే క్యాష్ లెస్ చికిత్స దొరికేది. కానీ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాని నేపథ్యంలో నెట్వర్క్ ఆసుపత్రులలో ఉద్యోగులు డబ్బులు చెల్లిస్తే తప్ప చికిత్స చేయని పరిస్థితి నెలకొంది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు చికిత్స జరిపించి రీ ఇంబర్స్మెంట్ కోసం బిల్లులు పంపాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ తో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరిపింది. ఈ మేరకు ప్రతి ఉద్యోగి నుంచి వారి మూలవేతనంలో 2 శాతం కాంట్రిబ్యూషన్ గా వసూలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఉద్యోగ సంఘాల విన్నపం మేరకు ఇది 1.5 శాతానికి ఖరారైంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నెట్వర్క్ ఆసుపత్రులు, ఆయా వ్యాధులకు ప్యాకేజీ చెల్లింపులు, ఉద్యోగ ఉపాధ్యాయుల డిపెండెంట్ల ఆధునికరణ తదితర **మిగతా 02లో**

# ముందుగా జీహెచ్ఎంసీ!

## ఆ తర్వాతే సీఎంసీ, ఎంఎంసీ

- హైదరాబాద్ మహానగర సంస్థల ఎన్నికల నిర్వహణ కసరత్తు ముమ్మరం
- ఓటరు సవరణ కార్యక్రమం అక్టోబరు రెండో వారంతో ముగింపు
- వెంటనే ఎన్నికల హడావుడి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్ మహానగర పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కసరత్తు ముమ్మరమైంది. కార్పోరేషన్ పునర్విభజన అనంతరం నూతనంగా ఏర్పాటైన మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో.. అధికారులు వ్యూహాత్మకంగా మొదటగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోనే ఎన్నికల సమరాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. నవంబరు నెలలోనే ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రాథమిక నిర్ణయానికి వచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కసరత్తులు వేగవంతంగా సాగుతున్నాయి. ఓటరు సవరణ కార్యక్రమం అక్టోబరు రెండో వారంతో ముగియనుండటంతో, ఆ తర్వాతే అసలు ఎన్నికల హడావుడి అధికారికంగా మొదలుకానుంది. ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు ఒక స్పష్టమైన కాలపట్టికను రూపొందించుకున్నారు. అక్టోబరులో తుది ఓటరు జాబితా చేతికి వచ్చిన వెంటనే దాని ఆధారంగా ఆయా డివిజన్లలో కొత్తగా ఏర్పడిన ప్రాంతాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తారు. దీంతో పాటు సమాంతరంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వెనుకబడిన తరగతుల సర్వే నివేదికల డేటాను పరిశీలిస్తారు. ఈ సామాజిక–ఆర్థిక సర్వే రిపోర్టుల ఆధారంగానే డివిజన్ల వారీగా రిజర్వేషన్లను చట్టబద్ధంగా ఖరారు చేస్తారు. వార్డుల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల వర్గీకరణ, రిజర్వేషన్ల ప్రక్రియ.. ఈ మూడు కీలకమైన ఘట్టాలు అక్టోబరు ఆఖరి నాటికి పూర్తి కానున్నాయి. ఇవన్నీ అనుకున్నట్లు సాగితే నవంబరు మొదటి లేదా రెండో వారంలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉందని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. **మిగతా 02లో**

## రేవంత్ ప్రభుత్వం మరో మోసం



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తామంటూ ప్రగల్భాలు

03

## రైతు డిస్కంతో సాగుకి ఉరి

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు



- బీఆర్ఎస్ లోనే చస్తా
- ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వ్యక్తి రేవంత్ రెడ్డి

03

# పెండింగ్ కథ కంచికి..

## ఉన్న ప్రాజెక్టులకే దిక్కు లేదు.. కొత్త ప్రాజెక్టు కు శంకుస్థాపన!

- ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు పైసా విదిల్చని రేవంత్ సర్కార్
- మళ్లీ ఆజిలాపూర్ లిఫ్ట్ కు రూ. 35.05 కోట్లు కేటాయింపు
- నిధుల కేటాయింపు మాట వరసకే.. ఆచరణలో మాత్రం పైసా రాలదు
- ఈ లిఫ్ట్ కు కోయిల్ సాగర్ ప్రాజెక్టు నుంచి నీటి కేటాయింపు
- ఈనెల 4 న ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టు ల పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష




**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో దశాబ్దాల కాలంగా పెండింగ్ లో ఉన్న ఎత్తిపోతల ప్రాజెక్టు లను పూర్తి చేసే దిక్కు లేదు కాని మళ్ళీ కొత్త ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన జరిగింది. పదేళ్లబీఆర్ఎస్ పాలన లో జిల్లా లో ఉన్న ప్రాజెక్టు లన్నీ పడావు పడేశారు.కెసిఆర్ సీఎంగా ఉన్న సమయంలో పాలమూరులో కుర్చీ వేసుకుని ప్రాజెక్టు లన్నీ పూర్తి చేస్తానని మాటలతో ముంచెత్తారు. కానీ ఆయన పదేళ్లు సీఎంగా ఉన్నా ఏనాడు పాలమూరులో కుర్చీ వేసుకుని ప్రాజెక్టుల గురించి పట్టించుకున్న పాపానా పోలేదనే విమర్శలు ఉన్నాయి. పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్ పనులను తన హయాంలో నే పూర్తి చేసి 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి రైతుల కళ్ళలో ఆనందాన్ని చూస్తానని పెద్ద పెద్ద మాటలు జిల్లా ప్రజల ఎదుట పలికారు.కానీ కెసిఆర్ హయాంలో ఈ ప్రాజెక్టు పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయినా పట్టించుకోలేదు. ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో రైతుల కళ్లల్లో కన్నీళ్లు తెప్పించిన ఘనత కేసీఆర్కే దక్కింది. కేసీఆర్ మాటలు అప్పట్లో జిల్లా ప్రజల్లో నమ్మకం పోయింది.కెసిఆర్ మాటలను నమ్మని ప్రజలు 2023 లో ఓటమి చవిచూపించి ఇంటికి పంపారు. బీఆర్ఎస్ను ఓడించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాకు **మిగతా 02లో**

# టీజీ టెట్ షెడ్యూల్ విడుదల

## జూన్ 16 నుంచి పరీక్షలు..10 సెషన్లలో పరీక్షలు

- జూన్ 22 వరకు టీజీటెట్ ఎగ్జామ్స్..
- టీచర్ ఉద్యోగార్థులకు గుడ్‌న్యూస్..
- టీజీటెట్-2026 షెడ్యూల్ రెడీ.. అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు




**-ముద్ర, తెలంగాణ బ్యూరో :**

*తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్–2026) షెడ్యూల్ విడుదలైంది ఆన్‌లైన్ పరీక్షల వివరణాత్మక ఈ షెడ్యూల్‌ను ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, టీజీటెట్ కన్వీనర్ ఆదివారం విడుదల చేశారు. ఈ పరీక్షలు జూన్ 16 నుంచి జూన్ 22 వరకు మొత్తం 5 రోజుల పాటు 10 సెషన్లలో జరగనున్నాయి. ప్రతిరోజూ పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహించబడతాయి. సెషన్–1 ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు, సెషన్–2 మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుంది. పూర్తి పరీక్షల షెడ్యూల్ అధికారిక వెబ్‌సైట్ https://school-edu.telangana.gov.inలో అందుబాటులో ఉంటుందని TGTET కన్వీనర్ తెలిపారు.*

## విద్యాశాఖలో నూతన ఒరవడి

02

చరిత్రలోనే తొలిసారిగా బోధనేతర సిబ్బంది ఆన్ లైన్ బదిలీలు

Telangana School Educational Department


- అడిషనల్ డైరెక్టర్ స్థాయి నుండి ఆఫీస్ సబోర్డినేట్ స్థాయి వరకు
- జిల్లా / జోనల్ / మల్టీ జోనల్ / స్టేట్ కేడర్ ఉద్యోగుల బదిలీలు

## అమరావతి అర్బన్ మొబిలిటీ ప్లానింగ్‌పై దృష్టి

హైకోర్టు భవనాల వద్ద రూ.547 కోట్లతో మౌలిక సదుపాయాలు

- ఏపీసీఆర్డీఏ బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- అమరావతి ఎకనామిక్ రీజియన్ ఆర్ఎఫ్ పీకి అంగీకారం
- సీఆర్డీఏకు సొంతంగా అగ్నిమాపక విభాగం
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 61వ సీఆర్డీఏ అథారిటీ
- 18 అంశాలపై చర్చించి ఆమోదం తెలిపిన సీఆర్డీఏ అథారిటీ

04




## వచ్చే ఎన్నికల్లో పొత్తుల వ్యూహం మారుస్తాం


ఇక ఒకటి రెండు సీట్ల పొత్తుల్లేవు
కనీసం 5 సీట్లు ఇస్తేనే దోస్తీ.. వ్యూహం మార్చిన సీపీఐ!
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



- ఖమ్మంలో బీజేపీ గెలిస్తే రాజీనామా.. కూనంనేని సవాల్!
- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాదు!
- స్వార్థ రాజకీయాలకు కమ్యూనిస్టుల్లో చోటు లేదు!

04

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 01.06.2026
www.mudranews.in | @mudranews



### మజ్జిగ : శరీరానికి చలవ చేస్తుంది



మజ్జిగ తాగడం వల్ల శరీరంలో వేడి తక్షణమే తగ్గుతుంది. ఎండదెబ్బ తగలకుండా కాపాడటంతో పాటు శరీరాన్ని రీహైడ్రేట్ చేసి రోజంతా ఉత్సాహంగా ఉంచుతుంది.

# సర్కార్ దొడ్డిదారి కోతలు!

**(మొదటి పేజీ తరువాయి)**

అంశాలపై తుది రూపం రావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం నెట్వర్క్ ఆసుపత్రులతో ఒప్పందం కాని, వివిధ వ్యాధులకు సంబంధించి ప్యాకేజీలు కానీ ఖరారు కాలేదు. పైగా ఆసుపత్రులతో ఎలాంటి ఒప్పందం కూడా జరగలేదు. అసలు కార్యరూపమే దాల్చని ఉద్యోగుల వైద్య పథకానికి చెల్లించాల్సిన మొత్తాలను మే నెల వేతనంతో కోతపెట్టారు.

**భార్యాభర్తలిద్దరికీ కోత**

విడ్డూరం ఏమిటంటే భార్యాభర్తలు ఇద్దరిలో ఎవరో ఒకరి వేతనం నుంచి పథకానికి సంబంధించిన మొత్తాన్ని కోత పెట్టాల్సి ఉండగా దంపతులిద్దరి వేతనంలోనూ కోత విధించడం కూడా పలు విమర్శలకు దారితీస్తోంది భార్య భర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులైన ఒకరు మరొకరిపై డిపెండెంట్గా చూపించడం ఆనవాయితీ. అయితే నిబంధనలేవి పాటించకుండా కోత విధించి తమ కక్ష సాధింపు చర్యను చాటుకున్నారని విమర్శలు తలెత్తుతున్నాయి.

**ట్రెజరీ వెబ్ సైట్ లోనే కోత**

ఇదిలా ఉంటే పథకానికి సంబంధించి విధి విధానాలు ఖరారు కాని నేపథ్యంలో డీడీఓలు కోత లేకుండా బిల్లులు సమర్పించారు. ఐతే వెబ్ సైట్ లో మాత్రం కాంట్రిబ్యూషన్ మొత్తం తగ్గిస్తూ బిల్ జనరేట్ అయింది. ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపట్ల సర్వత్రా విమర్శలు తలెత్తుతున్నాయి.

ఈహెచ్ఎస్ విధివిధానాలు ఖరారు కాకముందే డిడక్షన్ సరికాదు – ఎస్టియు

ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం ప్రవేశపెడుతున్న నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలుకు సంబంధించిన పూర్తి విధివిధానాలు ఇంకా ఖరారు కాకముందే ఉద్యోగుల మే నెల వేతనాల నుంచి 1.5 శాతం చందా మినహాయింపు చేపట్టడాన్ని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సదానందం గౌడ్, జుట్టు గజేందర్ ఒక ప్రకటనలో ఖండించారు. ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబ సభ్యుల నమోదు ప్రక్రియ ఇంకా 50 శాతం కూడా పూర్తి కాలేదన్నారు. ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్లో తరచూ మార్పులు జరుగుతుండటంతో అనేక మంది ఉద్యోగులు ఇంకా పూర్తి వివరాలు నమోదు చేయలేకపోయారన్నారు. కుటుంబ సభ్యుల అర్హత, భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే చందా మినహాయింపు విధానం వంటి కీలక అంశాలపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదన్నారు. వెంటనే కోతలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.




# పెండింగ్ కథ కంచికి..



**(మొదటి పేజీ తరువాయి)**

చెందిన రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇక జిల్లా లో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు లన్నీ పరుగులు పెడతాయని జిల్లా రైతాంగం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ రేవంత్ సర్కార్ కూడా కెసిఆర్ సర్కార్‌ను తలదన్నే విధంగా ఈ రెండున్నర ఏళ్ళ లో పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టక పోవడంతో ఎత్తిపోతల పథకాలన్నీ పడావు పడ్డాయి.

**పాలమూరు.. రంగారెడ్డి ప్రాజెక్టు :**

2015లో పనులను చేపట్టిన పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు కెసిఆర్ హయాంలోనే పెండింగ్ లో పడ్డాయి. 2023 లోపలే ఈ ప్రాజెక్టు పూర్తికావాల్సి ఉండేది. కృష్ణానది పై నిర్మించిన శ్రీశైలం జాలాశయం నుంచి వరద సమయంలో 70 టీఎంసీల నీటిని వాడుకునే విధంగా ఈ ప్రాజెక్టు కు రూపకల్పన చేశారు. నార్లాపూర్ వద్ద కృష్ణా నది నుంచి మోటార్ల ద్వారా పంపింగ్ చేసి నీటిని తరలిస్తారు. ఈ నీటిని మొదటగా ఏదుల వద్ద నిర్మించిన జలాశయానికి తరలిస్తారు. అక్కడినుంచి వట్టెం, కరివేన, ఉదండాపూర్ జలాశయాలకు నీటిని తరలిస్తారు. ఇప్పటికీ ప్రాజెక్టు పనులు మొదలై 11 ఏళ్లు అవుతున్నా పనులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. నార్లాపూర్ వద్ద తొమ్మిది మోటార్లకు గాను ఒక్క మోటార్ పనులు పూర్తయ్యాయి. జలాశయాలకు నీరు సరఫరా చేసేందుకు కాలువల పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టు పనులు 30 నెలల్లో పూర్తి అవుతాయని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించినా అమలు సాధ్యం కాదని నీటి పారుదల నిపుణులు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ టర్మ్ లో ఈ ప్రాజెక్టు పూర్తి అయ్యే పరిస్థితి కనిపించడం లేదనే ప్రశ్న ప్రతి ఒక్కరి లో తలెత్తుతోంది.ఈ ప్రాజెక్టు పూర్తి అవుతే 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. పలు జిల్లా లకు తాగునీరు కూడా అందించేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. ఇంత మంచి బృహత్తర ప్రాజెక్టు ను పూర్తి చేయడంలో కెసిఆర్ సర్కార్ విఫలమైంది. కానీ రేవంత్ సర్కార్ కూడా అదేబాటలో నడుస్తుందా లేదా అనే విషయం తెలియాల్సి ఉంది.

**నారాయణ పేట,కొడంగల్ లిఫ్ట్ ఇక అంతేనా..?**

కెసిఆర్ పదేళ్ల పాలనలో నిర్జీవం చేసిన నారాయణ పేట, కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రేవంత్ రెడ్డి జీవం పోశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రావడం కొడంగల్ నుంచి ఎమ్మెల్యే గా గెలుపొందిన రేవంత్ రెడ్డి సీఎం కావడం తో ఈ లిఫ్ట్ నిర్మాణం పట్టాలెక్కింది. కెసిఆర్ తొక్కి పడేసిన ఈ లిఫ్ట్ ను రేవంత్ సర్కార్ తెర పైకి తెచ్చింది. ఎన్ని ఏళ్ళుగా ఎదురు చూస్తున్న ఈ ప్రాంత రైతులకు ప్రాజెక్టు పూర్తి అవుతుందనే నమ్మకం కుదిరింది. బీమా ప్రాజెక్టు నుంచి నీటి ని ఎత్తి పోసి లక్ష ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యం తో ఈ ఎత్తిపోతల పథకం రూపుదిద్దుకుంది. కానీ... రేవంత్ సర్కార్ వచ్చి రెండున్నర ఏళ్ళు పూర్తి కావచ్చినా ఈ లిఫ్ట్ పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికీ భూసేకరణ పనులు పూర్తి కాలేదు. కొన్ని గ్రామాల ప్రజలు భూములకు పరిహారం తక్కువవైందని భూములు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఈ లిఫ్ట్ పనులు మంద కొడిగా సాగుతున్నాయి. ఈ లిఫ్ట్ కూడా ఈ టర్మ్ లో పూర్తి చేస్తామని అంటున్న సర్కార్ కు భూసేకరణ అడ్డంకి గా మారింది. ప్రస్తుతం నడుస్తున్న పనులను బట్టి చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ టర్మ్ లో ఈ లిఫ్ట్ పూర్తయ్యేటట్లు కనిపించడం లేదు. ఇలాగే నెట్టెం పాడు, కల్వకుర్తి ఎత్తిపోతల పనులు ఎక్కడికక్కడే పెండింగ్ లో పడిపోయాయి.వీటి పనులు కూడా ఇప్పట్లో పూర్తి అయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

**ఆజిలాపూర్ లిఫ్ట్ కు శంకుస్థాపన :**

'కట్టుకున్న పెళ్ళానికి కాసు బంగారం లేదంటే ఇంకొకరు వచ్చి రవ్వల నక్లేస్' కావాలని అడిగిందట.. అన్న చందంగా ఉంది రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ పరిస్థితి. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులకే పైసా దిక్కులేదంటే మళ్ళీ కొత్త ప్రాజెక్టు కు శంకుస్థాపన చేశారు నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో చాలా ఎత్తిపోతల పథకాల ప్రాజెక్టు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ పక్కన పెట్టి దేవరకద్ర నియోజకవర్గంలో ఆజిలాపూర్ లిఫ్ట్ పనులకు గత శనివారం శంకుస్థాపన జరిగింది. ఈ లిఫ్ట్ నిర్మాణానికి రూ. 32.05 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ లిఫ్ట్ ను గత కెసిఆర్ ప్రభుత్వం తొక్కిపెట్టిందే.మళ్ళీ ఇప్పుడు ఈ లిఫ్ట్ ను తెర పైకి తెచ్చిన రేవంత్ సర్కార్ నిధులు కూడా కేటాయించింది. ఇదే నియోజకవర్గం లో ఉన్న కోయిల్ సాగర్ ప్రాజెక్టు నుంచి ఈ లిఫ్ట్ కు నీటిని తరలిస్తారు. అజిలాపూర్, గద్దెగూడెం, వెంకటాయి పల్లి గ్రామాల్లో ని 1400 ఎకరాలకు ఈ లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. కానీ కోయిల్ సాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకే రెండో పంటకే చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం కష్టంగా ఉంటుంది. ఈ సమయంలో ఆజిలాపూర్ లిఫ్ట్ కు నీరందడం ప్రశ్నత్మాకంగా మారే అవకాశం ఉంది. కోయిల్ సాగర్ ప్రాజెక్టు కు జూరాల ప్రాజెక్టు నుంచి లిఫ్ట్ ద్వారా నీటిని తరలిస్తున్నారు. కానీ ఈ ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం ఒక టీఎంసీ కి కొంచం తక్కువగానే ఉంది. ప్రాజెక్టు సామర్థ్యం పెంచాలని ప్రతిపాదన ఉన్న అది పైళ్ల కే పరిమితం అయింది.రేవంత్ సర్కార్ పెండింగ్ ప్రాజెక్టు ల పూర్తి పై దృష్టి పెడుతుందా... లేక కొత్త లిఫ్ట్ లను పూర్తి చేస్తుందో ఈ రెండున్నర ఏళ్ళు వేచిచూడాలి. ప్రాజెక్టు ల పై సమీక్ష నిర్వహించేందుకు ఈ నెల 4 న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కు వస్తున్నారు.

# విద్యాశాఖలో నూతన ఒరవడి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

పాఠశాల విద్యాశాఖలో షెడ్యూల్ ప్రకారం అధికారుల, బోధనేతర సిబ్బంది బదిలీల ప్రక్రియ విజయవంతంగా ముగిసినట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.38 బదిలీల సమగ్ర మార్గదర్శకాల ప్రకారం బదిలీలు జరిగినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నీకోలస్ ఆదివారం స్పష్టం చేశారు. పాఠశాల విద్యాశాఖ చరిత్రలోనే మొదటిసారిగా బోధనేతర సిబ్బంది బదిలీలను ఆన్‌లైన్ విధానంలో చేపట్టినట్లు తెలిపారు. అడిషనల్ డైరెక్టర్ స్థాయి నుండి ఆఫీస్ సబోర్డినేట్ స్థాయి వరకు జిల్లా / జోనల్ / మల్టీజోనల్ / స్టేట్ కేడర్‌కు చెందిన అన్ని బదిలీలను విజయవంతంగా నిర్వహించామని స్పష్టం చేశారు. అత్యున్నత స్థాయి నుండి క్షేత్ర స్థాయి వరకు అన్ని విభాగాల బోధనేతర సిబ్బంది, అధికారుల బదిలీలు విజయవంతంగా జరిగాయని తెలిపారు. అడిషనల్ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారులు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబోర్డినేట్లు బదిలీలు జరిగినట్లు పేర్కొన్నారు.

**డీఈఓల బదిలీలు**

విజయకుమారి: మేడ్చల్ డీఈవో స్థానం నుండి మహబూబ్‌నగర్ డీఈవోగా బదిలీ అయ్యారు.

రేణుక: వికారాబాద్ డీఈవో స్థానం నుండి బదిలీ అయి, మేడ్చల్ డీఈవోగా పోస్టింగ్ పొందారు.

రోహిణి: హైదరాబాద్ డీఈవో స్థానం నుండి సంగారెడ్డి డీఈవోగా బదిలీ అయ్యారు.

సుశీందర్ రావు: రంగారెడ్డి డీఈఓ స్థానం నుండి నల్గొండ డీఈవోగా బదిలీ అయ్యారు.

బి. భిక్షపతి: నల్గొండ డీఈవో స్థానం నుండి యాదాద్రి భువనగిరి డీఈవోగా బదిలీ అయ్యారు.

రేవతి రెడ్డి: రంగారెడ్డి జిల్లా నూతన డీఈఓగా నియమితులయ్యారు.

వెంకటేశ్వర్లు: సంగారెడ్డి స్థానం నుండి బదిలీ అయి, హైదరాబాద్ జిల్లా నూతన డీఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

శాస్త్రి (అసిస్టెంట్ డైరెక్టర్): సిద్దిపేట జిల్లా డీఈవోగా పోస్టింగ్ పొందారు.

# ముందుగా జీహెచ్ఎంసీ!

**(మొదటి పేజీ తరువాయి)**

**జీహెచ్ఎంసీ తర్వాతే...**

రాజధాని పరిధిలో మూడు కార్పొరేషన్లు ఉండగా.. తొలుత ఒక్క జీహెచ్ఎంసీకే ఎన్నికలు నిర్వహించడానికి బలమైన కారణాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని సుమారు 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేసి పరిపాలనా సౌలభ్యం కోసం 3 నూతన కార్పొరేషన్లుగా (జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ) పునర్విభజించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 10 నాటికే పాత జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు ముగిసిపోవడంతో మరుసటి రోజు కొత్తగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లు అధికారికంగా ఉనికిలోకి వచ్చాయి. ఈ 3 సంస్థలకూ జీహెచ్ఎంసీ చట్టమే వర్తిస్తుంది. ఈ చట్టపరమైన నిబంధనల ప్రకారం.. పాత పాలకమండలి గడువు ముగిసిన ఆరు నెలల లోపల ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధన గతంలో ఉనికిలో ఉన్న పాత జీహెచ్ఎంసీకి మాత్రమే వర్తిస్తుండటం, మిగిలిన రెండు కొత్త సంస్థలు కావడం వల్ల వాటికి కొంత సమయం దొరికింది.

**మారిన రాజకీయ ముఖచిత్రం**

ఈ పునర్విభజన ప్రక్రియ ఓఆర్ఆర్ పరిధిలోని స్థానిక సంస్థల రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసింది. దాదాపు 28 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ మూడు కార్పొరేషన్లలో ఏ పార్టీ ఏ స్థానాన్ని కైవసం చేసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో తీవ్ర గందరగోళం, అయోమయం నెలకొన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సరళిని విశ్లేషిస్తే.. జీహెచ్ఎంసీలోని 150 డివిజన్లలో ఒక ప్రధాన పార్టీకి సుమారు 60 నుంచి 70 స్థానాలు దక్కే అనుకూల వాతావరణం ఉంది. మిగిలిన స్థానాల్లో మాత్రం ఊహించని విధంగా త్రిముఖ పోటీ తథ్యమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. మొదట జీహెచ్ఎంసీ ఎన్నికలను నిర్వహించి, అక్కడి ప్రజాభిప్రాయాన్ని, ఓటర్ల మూడ్‌ను క్షుణ్ణంగా విశ్లేషించుకున్న తర్వాతే.. సీఎంసీ, ఎంఎంసీల ఎన్నికలపై ముందడుగు వేయాలని పాలక పక్షం యోచిస్తున్నది.






# పాక్ ఐఎస్ఐ పన్నాగం

## తిప్పికొట్టిన భద్రతా సంస్థలు

**ముద్ర డెస్క్:**

పాకిస్తాన్ దేశంలో తినడానికి తిండి ఉండదు. తాగడానికి నీళ్లు ఉండవు. నడవడానికి రోడ్డు కూడా ఉండదు. అసలు అక్కడ బతకడానికి అవకాశం కూడా ఉండదు. ప్రజలు దుర్భరమైన దారిద్రంలో జీవిస్తుంటారు. పేదరికంలో బతికీడుస్తూ ఉంటారు. కానీ పాలకులు మాత్రం భారతదేశం మీద విషం చిమ్ముతూ ఉంటారు. ప్రపంచ దేశాల వద్ద అప్పులు తెచ్చి.. భారత వ్యతిరేక కార్యకాల పాలకు పాల్పడుతుంటారు. ఉగ్రవాదులతో అంట కాగి.. భారత దేశంలో దారుణాలు చేసేందుకు రూపకల్పన చేస్తుంటారు. పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ మన దేశంలో అనేక ప్రాంతాలలో దాడులు చేసేందుకు రూపకల్పన చేసింది.. దీనికోసం ఒక ముఠాను ఏర్పాటు చేసుకుంది.. ఈ ముఠాలో మొత్తం 8 మంది ఉగ్ర సభ్యులు ఉన్నారు. వీరందరిని మన దేశ ఇంటలిజెన్స్ వర్గాలు పట్టుకున్నాయి. మహారాష్ట్ర, పంజాబ్, ఢిల్లీ, చంటిగాడు ప్రాంతాలలో నిర్వహించిన తనిఖీలలో ఈ ముఠా సభ్యులు పట్టుపడ్డారు. కీలకమైన వంతెనలు.. రైల్వే స్టేషన్లు.. పార్కులు.. వంతెనలు.. ఢిల్లీలో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది కార్యాలయాలను వీరు లక్ష్యంగా చేసుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో విజయ్ అలియాస్ షూటర్.. నితీష్ పాశ్వాన్.. రిజ్వాన్ అహ్మద్.. షేక్ అహ్మద్.. సాజిద్ మహబూబ్.. షేక్ అలియాస్ అర్బాజ్ ఖాన్.. హర్విందర్ సింగ్.. గగన్ దీప్ సింగ్.. మన్ జీత్ సింగ్.. కామీలామ ఉన్నారు. వీరంతా కూడా ఐఎస్ఐ తో కుమ్మక్కయ్యారు.

ఇటీవల కాలంలో మన దేశ భద్రత సంస్థలు అత్యంత గోప్యంగా తనిఖీలు చేపడుతున్నాయి. ముఖ్యంగా ఉగ్రవాదుల కదలికల మీద ఆరా తీస్తున్నాయి. పాకిస్తాన్ దేశానికి సరిహద్దుల్లో ఉన్న ఉత్తర ప్రదేశ్.. రాజస్థాన్.. ఢిల్లీ.. గుజరాత్ వంటి రాష్ట్రాలలో పటిష్టంగా తనిఖీలు చేపడుతున్నాయి. ఈ తనిఖీలలో ఉగ్రవాదుల డొంకలు కదులుతున్నాయి. అయితే వీరందరికీ కూడా ఐఎస్ఐతో సంబంధం ఉండడం ఆందోళన కలిగిస్తోంది. సరిహద్దుల్లో పటిష్టమైన భద్రత నిర్వహిస్తున్నప్పటికీ.. స్లీపర్ సెల్స్ మాదిరిగా వీరు పని చేయడం.. దేశంలో విధ్వంసానికి కుట్ర చేయడం ఆందోళన కలిగిస్తోంది.

వీరి వెనుక కేవలం పాకిస్తాన్ ఐఎస్ఐ మాత్రమే కాకుండా.. ఇంకా అనేక రకాల ఉగ్రవాద సంస్థలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ సంస్థలకు గల్ఫ్ దేశాల నుంచి భారీగా డబ్బులు వస్తున్నట్లు సమాచారం. ఆ డబ్బులను ఉగ్రవాద కార్యకలాపాల కోసం వాడుతున్నట్టు తెలుస్తోంది. తాజాగా అరెస్టయిన ఈ 8 మంది ముఠా సభ్యులను పోలీసులు విచారిస్తున్నారు. వారు చెప్పిన వివరాల ఆధారంగా త ఖీలు చేపడుతున్నారు. ఈ లెక్కన పాకిస్తాన్ ఐఎస్ఐ మనదేశంలో భీకరమైన ఉగ్రదాడులకు ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది.

# రాష్ట్రంలో పాఠశాల విద్య మెరుగుపడింది

## విద్యాశాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర డెస్క్:**

రాష్ట్రంలో పాఠశాల విద్య పనితీరు గణనీయంగా మెరుగుపడిందని సీఎం రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇవాళ విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యా రంగంలో సాధించిన ప్రగతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు, పాఠశాలల పనితీరు మెరుగుపడిందని కేంద్ర విద్యాశాఖ స్వయంగా వెల్లడించిందని సీఎం గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన పీజీఐ నివేదిక తమ ప్రజా ప్రభుత్వం కనబరిచిన అద్భుత పనితీరుకు ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. విద్యాశాఖ పనితీరుపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ సానుకూల నివేదికలు భవిష్యత్తులో మరిన్ని సంస్కరణలు తీసుకురావడానికి తమకు ఎంతో ప్రేరణనిచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో విద్యా వ్యవస్థ పూర్తిగా విధ్వంసమైందని మండిపడ్డారు. నాటి సర్కార్ ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తే.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక శ్రద్ధ వహించి పాఠశాల విద్యను మళ్లీ పట్టాలెక్కించామని, అందుకే ఇప్పుడు జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు దక్కిందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 01.06.2026
www.mudranews.in | @mudranews



**మజ్జిగ : జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది**

మజ్జిగలో ఉండే హెల్తీ బ్యాక్టీరియా (ప్రోబయోటిక్స్) జీర్ణవ్యవస్థను చురుగ్గా ఉంచుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం మరియు మలబద్ధకం వంటి సమస్యలను ఇది సులభంగా నివారిస్తుంది.



## దేశ చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం


**ఇందిరమ్మ ఇళ్లతో దేశానికి తెలంగాణ మార్గదర్శకం**
**13 నెలల్లో లక్ష ఇళ్లు పూర్తి**
**మరో రెండు నెలల్లో మరో రెండు లక్షలు పూర్తి చేస్తాం**
**జూన్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెండో విడతకు శ్రీకారం**
**కొత్తగూడలో సామూహిక గృహప్రవేశాలు**
**ఈ ఏడాది 3.50 లక్షల ఇళ్ల మంజూరు**
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయంతో భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమమే కాకుండా పేద కుటుంబాల జీవితాలను మార్చే సామాజిక ఉద్యమంగా మారిందన్నారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ, తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లాలోని కొరారి గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నామని, రెండు విడతల్లో కలిపి ప్రతి నియోజకవర్గానికి 5,500 నుంచి 6,500 ఇళ్ల వరకు కేటాయించినట్లు చెప్పారు. గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 1,500 ఇళ్ల వరకు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.గత ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో ఇప్పటికే లక్ష ఇళ్లు పూర్తయ్యాయని, మరో రెండు లక్షల ఇళ్లు త్వరలో పూర్తి కానున్నాయని తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి 3.5 లక్షల ఇళ్ల మంజూరుకు పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు వెల్లడించారు.కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల వరకు మాత్రమే సహాయం అందిస్తుండగా, తెలంగాణ ప్రభుత్వం స్వంత నిధులతో ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షలు అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు.అసంపూర్తిగా ఉన్న పాత ఇందిరమ్మ ఇళ్లు, గృహలక్ష్మి పథకం కింద పూర్తికాని ఇళ్ల నిర్మాణాలకు కూడా రెండో విడతలో ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ పథకం కింద పాక్షికంగా సహాయం పొందిన వారికి కూడా ఈ విడతలో ఇళ్ల మంజూరు కల్పించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

## రైతు డిస్కంతో వ్యవసాయానికి ఉరితాడు

**సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** పగలు మాత్రమే అందుబాటులో ఉండే సోలార్ విద్యుత్‌తో రైతులకు 24 గంటల కరెంట్ ఎలా ఇస్తారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతు డిస్కం (ఆర్పీడీసీఎల్) వ్యవసాయ రంగానికి మేలు కంటే నష్టమే ఎక్కువ చేస్తుందని ఆరోపించారు.రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించడానికే ఆర్పీడీసీఎల్ ఏర్పాటు చేస్తున్నామన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం రైతు డిస్కంకు అధికంగా పునరుత్పాదక ఇంధన విద్యుత్ (సోలార్ పవర్) కేటాయిస్తామని పేర్కొన్నారని, సోలార్ విద్యుత్ పగటి వేళల్లో మాత్రమే లభిస్తుందని గుర్తు చేశారు. రైతు డిస్కం వల్ల కాళేశ్వరం, దేవాదుల, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్ సాగర్, సీతమ్మసాగర్ వంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, మిషన్ భగీరథ పథకంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. వరదల సమయంలో నిరంతరాయంగా మోటార్లు నడపకపోతే ప్రాజెక్టులు నిండవని, పగటి కరెంట్‌కే పరిమితమైతే సాగునీరు, తాగునీటి సరఫరా ఇబ్బందుల్లో పడుతుందని హెచ్చరించారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే కుట్రలో భాగంగానే మూడో డిస్కం ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించిన హరీశ్ రావు, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై అసెంబ్లీలో చర్చ జరపాలని కోరారు.

**జీవితాంతం కేసీఆర్ తోనే బీఆర్ఎస్ లోనే చస్తా**

తాను జీవితాంతం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతోనే ఉంటానని వందసార్లు చెప్పానని మాజీ మంత్రి హరీశ్ రావు గుర్తు చేశారు. అదే విషయాన్ని మరో వంద సార్లు చెబుతానని స్పష్టం చేశారు. నా పుట్టుక బీఆర్ఎస్‌లోనే.. చావు కూడా బీఆర్ఎస్‌లోనే అని వెల్లడించారు. ఆదివారం సిద్దిపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వ్యక్తి రేవంత్ రెడ్డి అని అన్నారు. నాలుగు పార్టీలు మారిన ఆయనకు తన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అసలు రేవంత్ రెడ్డి మాటలకు విలువ ఉంటుందా, కాంగ్రెస్‌లో ఉండి మోడీ, బీజేపీ పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. రేపు ఏ పార్టీలో ఉంటారో తెలియదని అన్నారు.

## ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలిగించే కుట్ర

**బీజేపీ పై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మండిపాటు**



**ముద్ర, ఆదిలాబాద్ :** కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లను తొలగించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. ఆదివారం ఆదిలాబాద్ లోని చిల్కూరి లక్ష్మి గార్డెన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, బీఎల్ఏ–2ల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూల ఓట్లు గల్లంతు కావడం దీనికి నిదర్శనమన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి ఓటర్ల హక్కులను కాపాడాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో గెలుపోట ములు సహజమని, అయితే కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చేందుకు బీజేపీ రాజకీయ కుట్రలకు పాల్పడుతోం దన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్, సీబీఎస్ఈ రివిజన్ స్కామ్ వంటి ఘటనలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెడుతున్నాయన్నారు. ఎన్నికల ముందు ధరలు తగ్గిస్తామని చెప్పి ఎన్నికల అనంతరం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలను మోసం చేసిందన్నారు. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ నియోజకవర్గంలో 292, బోథ్‌లో 303 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఆదిలాబాద్‌లో 90 వేల, బోథ్‌లో 64 వేల ఓటర్ల మ్యాపింగ్ జరగలేద న్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బీఎల్ఏ–2 బోథ్ ఇన్‌చార్జి రమేష్, ఆదిలాబాద్, బోథ్ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస్, అడే గజేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య, మార్కెట్ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సంక్షేమంలో సింగరేణి సరికొత్త అధ్యాయం

**కార్మిక కుటుంబాలకు రక్షణ కవచం రూ. కోటి ప్రమాద బీమా** **45 కుటుంబాల్లో వెలుగు** **దేశానికే ఆదర్శంగా తెలంగాణ నేడు దేశ వ్యాప్తంగా విస్తరణ**
**తాజాగా నామమాత్రపు ప్రీమియంతో రూ. 50 లక్షల ఆరోగ్య బీమా పథకం** **సింగరేణి లో ఇప్పటికే రూ. 41 కోట్ల బీమా సొమ్ము చెల్లింపు**



పక్క చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నాగుల రాజయ్య. ఆయనకు ఒక కొడుకు, ఒక కుమార్తె. సింగరేణిలో కారుణ్య నియామకం ద్వారా ఆయన కుమారుడు సంతోష్ ఉద్యోగంలో చేరాడు. కానీ రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు సంతోష్ను కబళించింది. ఆయన సింగరేణిలో చేరి కూడా కేవలం 18 నెలలు మాత్రమే. ఈ సర్వీసుకు వచ్చే టర్మినల్ బెనిఫిట్స్ కూడా చాలా తక్కువ. ఇలాంటి పరిస్థితుల్లో దిక్కుతోచని స్థితిలో ఉన్న రాజయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సింగరేణిలో ప్రారంభించిన రూ.కోటి ప్రమాద బీమా పథకమే పెద్దకొడుకులా ఆదుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న రాజయ్య వృద్ధ దంపతులకు ప్రస్తుతం ఆర్థికభరోసాగా మారింది.




**ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు పెండ్రి లత. ఈమె భర్త రంజిత్ కుమార్. సింగరేణిలో పనిచేసేవాడు. పుట్టిన నెల రోజుల కొడుకును చూసి రావడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మరణించాడు. దీంతో భార్య లత, తల్లి, నెల రోజుల కుమారుడు ఒంటరివారయ్యారు. అయితే ఆయనకు సింగరేణితో ఒప్పందం ఉన్న బ్యాంక్ లో సాలరీ ఖాతా ఉండటంతో వారికి రూ.కోటి బ్యాంకు నుంచి వచ్చాయి.. ఈ చెక్కును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా అందజేశారు.**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా, మానసికంగా కుంగిపోవడం సహజం. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో అమలవుతున్న ఉచిత ప్రమాద బీమా పథకం.సింగరేణిలో కారుణ్య నియామకంపై ఉద్యోగంలో చేరిన నాగుల సంతోష్ కేవలం 18 నెలల సేవ అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిదండ్రులకు ఆయన ఒక్కరే ఆధారం. ఈ సమయంలో రూ.కోటి ప్రమాద బీమా వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించింది. అలాగే సింగరేణి ఉద్యోగి రంజిత్ కుమార్ తన నెల రోజుల కుమారుడిని చూసి వస్తూ ప్రమాదంలో మరణించగా, భార్య లత, చిన్నారి కుమారుడు, తల్లికి ఈ పథకం ద్వారా రూ.కోటి బీమా అందింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా చెక్కును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సింగరేణి యాజమాన్యం 2024లో దేశంలోనే తొలిసారిగా రూ.1.25 కోట్ల వరకు ఉచిత ప్రమాద బీమా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పథకం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచింది. సింగరేణి ఉద్యోగుల సాలరీ ఖాతాలు ఉన్న బ్యాంకుల ద్వారా రూ.1 కోటి నుంచి రూ.1.25 కోట్ల వరకు ప్రమాద బీమా వర్తిస్తోంది. ఈ పథకం కోసం ఉద్యోగులు ఒక్క రూపాయి ప్రీమియం కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం 40,275 మంది సింగరేణి ఉద్యోగులు ఈ ప్రయోజనం పొందుతున్నారు. గత రెండేళ్లలో వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 32 మందికి సుమారు రూ.28 కోట్లు, యూనియన్ బ్యాంక్ ద్వారా 13 మందికి సుమారు రూ.13 కోట్లు బీమా సొమ్ము అందింది. ప్రమాద మరణాలకే కాకుండా ప్రమాదాల్లో శాశ్వత లేదా పాక్షిక వికలాంగులైన వారికి కూడా ఈ బీమా వర్తిస్తోంది. ఇటీవల గని ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన ఓ కార్మికుడి కుటుంబానికి రూ.1 కోటి బీమా అందించారు. అదేవిధంగా సహజ మరణానికి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఉచిత బీమా సదుపాయం కూడా కల్పిస్తున్నారు. అంతేకాకుండా నామమాత్రపు ప్రీమియంతో రూ.50 లక్షల ఆరోగ్య బీమా సదుపాయాన్ని కూడా అమలు చేస్తున్నారు. సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 30 వేల మంది పొరుగు సేవల సిబ్బందికి కూడా రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తోంది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు కూడా రూ.30 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉచిత ప్రమాద బీమా కొనసాగించేలా బ్యాంకులతో ఒప్పందాలు కుదిరాయి. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ప్రారంభమైన ఈ సంక్షేమ కార్యక్రమం ప్రస్తుతం వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తూ, దేశవ్యాప్తంగా ఆదర్శ నమూనాగా మారింది.

## రైతు డిస్కం పేరిట మరో మోసం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
**రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తామంటూ ప్రగల్బాలు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రైతు డిస్కం పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మరో మోసానికి తెరలేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో కంటోన్మెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు 24 గంటల కరెంట్ ఇస్తామని చెబుతున్నారని విమర్శించారు. కేసీఆర్ అప్పులు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, కల్యాణలక్ష్మి, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతు బంధు, రుణమాఫీ వంటి పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4 లక్షల కోట్ల అప్పులు చేసినా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కనిపించడంలేదన్నారు. రైతు బంధు నిలిపివేసి 'రాహుల్ బంధు' నడుస్తోందని, రైతుల ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించిన కేటీఆర్, జూన్ 25 నుంచి ప్రారంభమయ్యే ప్రక్రియలో ఓట్ల తొలగింపులు జరగకుండా జాగ్రత్త పడాలని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో 95 లక్షలు, బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ఆర్మీ భూముల్లో నివసించే సుమారు 35 వేల మంది ఓటర్లకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు.మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. సర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని, బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కంటోన్మెంట్ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి మన్నే క్రిశాంక్ మాట్లాడుతూ యువతకు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వాలని, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, నివేదిత, జక్కుల మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతు డిస్కం పేరుతో ప్రైవేటీకరణ కుట్ర

**- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రైతు డిస్కం ఏర్పాటుపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాల పేరుతో కొత్త డిస్కం ఏర్పాటు చేసి, ప్రస్తుతం ఉన్న విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం నిజంగా అలాంటి ఉద్దేశం లేకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా ప్రెస్‌మీట్ నిర్వహించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.బంజారాహిల్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ, ఉచిత విద్యుత్‌ను ఎత్తివేయబోమని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, అందువల్ల ప్రభుత్వ ప్రకటనలపై రైతులకు నమ్మకం కలగడం లేదన్నారు.రైతు డిస్కం వల్ల భవిష్యత్తులో ఉచిత విద్యుత్ విధానానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్న కవిత, ఈ ప్రతిపాదనపై విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) రాష్ట్రవ్యాప్తంగా రైతుల అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. రైతులకు నష్టం చేసే విధంగా ఉంటే అనుమతి ఇవ్వకూడదని స్పష్టం చేశారు.తెలంగాణ జాగృతి తరఫున రైతు డిస్కంపై ఇప్పటికే న్యాయపోరాటం ప్రారంభించామని, అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడుతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో తీసుకొస్తున్న విధానాలు చిన్న వ్యాపారులు, చిన్న పరిశ్రమలకు నష్టం కలిగిస్తున్నాయని విమర్శించారు.పాలమూరు ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని కోరిన కవిత, దసరా లోపు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించకపోతే పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి చేయి తొలగించాల్సి వచ్చిన ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# చదువుతోనే అభివృద్ధి సాధ్యం

**ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తయితేనే రెండు పంటలకు నీళ్లు రూ.450 కోట్లతో ఎస్ఎల్బీసీ కాలువల లైనింగ్**
**రూ.13,600 కోట్లతో హైబ్రిడ్ యాన్యుటి మోడల్ రోడ్డు**
**రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



**ముద్ర, నల్లగొండ- కనగల్:** చదువుతోనే సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం కనగల్ మండల కేంద్రంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన పనులను ఆకస్మికంగా పరిశీలించిన ఆయన, నిర్మాణాలను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తిప్పర్తి, కనగల్ మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయడం ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేస్తున్నామని తెలిపారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందని విమర్శించిన మంత్రి, ఎంజీ యూనివర్సిటీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన కృషిని గుర్తు చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంజీ యూనివర్సిటీలో ఫార్మసీ, డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఎల్ఎల్బీ కోర్సులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.ఎస్ఎల్బీసీ సొరంగం పనుల్లో ఇప్పటికే 80 శాతం పురోగతి సాధించామని, మిగిలిన పనులను కూడా పూర్తి చేసి రైతులకు రెండు పంటలకు సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పనులు వేగవంతమయ్యాయని, ఆధునిక సాంకేతికతతో సొరంగ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు.ధర్వేశిపురం నుంచి కనగల్, గుర్రంపోడు, దేవరకొండ మీదుగా దిండి వరకు రూ.13,600 కోట్ల వ్యయంతో హైబ్రిడ్ యాన్యుటి మోడల్‌లో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయిందని, వచ్చే నెలలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు.అదనంగా రూ.450 కోట్లతో ఎస్ఎల్బీసీ కాలువల లైనింగ్ పనులు కూడా కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 1.06.2026
www.mudranews.in | @mudranews



## మజ్జిగ : అసిడిటీని తగ్గిస్తుంది

మసాలాలు, కారంగా ఉండే ఆహారాలు తిన్నప్పుడు వచ్చే కడుపులో మంటను మజ్జిగ తగ్గిస్తుంది. ఇందులో ఉండే లాక్టిక్ యాసిడ్ కడుపులోని యాసిడ్లను అదుపు చేసి ఉపశమనం కలిగిస్తుంది.



# విశ్వకర్మలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**జనగణనలో పంచదాయిలను విశ్వకర్మ–విశ్వబ్రాహ్మణులుగా గుర్తించాలి**

సమాజ నిర్మాణానికి పునాది వేసిన చేతులు ఎవరివి? మనిషి పుట్టుక నుండి రాతి యుగం,లోహ యుగం, నవ నాగరికతకు రూపం ఇచ్చిన వారు ఎవరు? ఇంజనీరింగ్ కళాశాలలు, యంత్ర సాంకేతికత, ఆధునిక పరిశ్రమలు లేని కాలంలో వ్యవసాయ పనిముట్లు సమాజానికి కావలసిన ప్రతి వస్తువు నుంచి ఆలయ నిర్మాణం వరకు సమాజ అవసరాలను తీర్చిన వారు ఎవరు? చరిత్ర స్పష్టంగా చెబుతున్న సమాధానం ఒక్కటే.. విశ్వకర్మలు. నేడు ఇంజనీర్లు, డిజైనర్లు, ఆర్కిటెక్టులు, శిల్పులు, టెక్నీషియన్లు వేర్వేరు రంగాలుగా కనిపిస్తున్నా, శతాబ్దాల క్రితమే ఈ నైపుణ్యాలన్నింటినీ ఆచరణలో చూపించిన వారు విశ్వకర్మ సమాజం. కొలతలు, నిర్మాణం, లోహ శాస్త్రం, చెక్క పనితనం, శిల్పకళ, ఆభరణాల తయారీ వంటి రంగాల్లో అపూర్వ ప్రతిభ కనబరిచిన వారే విశ్వకర్మలు. అందుకే వారిని "నాటి ఇంజనీర్లు", "సమాజ సృష్టికర్తలు" అని గౌరవంగా పేర్కొంటారు. రైతు పొలం దున్నాలంటే నాగలి కావాలి. ఆ నాగలికి రూపం ఇచ్చేది కమ్మరి.ముగ్గు పోసిన కానుండి మూలవాసం వరకు ఇంటికి తలుపులు, కిటికీలు, గృహ నిర్మాణానికి అవసరమైన సామగ్రి కావాలి. వాటిని రూపొందించేది వడ్రంగి. లోహ వస్తువులు, పాత్రలు, కళాఖండాలకు ప్రాణం పోసేది కంచరి. దేవాలయాల వైభవాన్ని శాశ్వతంగా నిలిపేది శిల్పి. బంగారాన్ని ఆభరణంగా మార్చి అందాన్ని ఆవిష్కరించేది స్వర్ణకారుడు. ఈ పంచదాయిల కృషి లేకుండా ఏ గ్రామం గ్రామీణాభివృద్ధి జీవనం, వ్యవసాయం, కళలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు పూర్తి కావు. అందుకే వేమన "విశ్వకర్మ లేనిదే విశ్వంబు లేదుయా" అని చెప్పారు. కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, స్వర్ణకారుడు..ఇవి కేవలం వృత్తుల పేర్లు మాత్రమే కాదు. భారతీయ నాగరికతకు, శిల్ప సంపదకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలు. శతాబ్దాలుగా తమ చేతి నైపుణ్యంతో సమాజాన్ని ముందుకు నడిపించిన వారసత్వ వృత్తులు. అయితే కాలగమనంలో పరిస్థితులు మారాయి. యాంత్రీకరణ పెరిగింది. భారీ పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. రెడీమేడ్ ఉత్పత్తులు మార్కెట్‌ను ఆక్రమించాయి. ఒకప్పుడు చేతివృత్తులపై ఆధారపడిన సమాజం క్రమంగా యంత్రాలపై ఆధారపడే స్థితికి చేరింది. ఫలితంగా సంప్రదాయ విశ్వకర్మ వృత్తులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

తరతరాలుగా కొనసాగిన వృత్తులకు గిరాకీ తగ్గింది. చేతి నైపుణ్యానికి విలువ తగ్గింది. సంప్రదాయ కళలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.



యువతలో వృత్తుల పట్ల ఆసక్తి తగ్గుతోంది. ఇది కేవలం ఒక వర్గం సమస్య కాదు, దేశీయ సంప్రదాయ నైపుణ్య సంపదకు ఎదురవుతున్న ముప్పు. ప్రభుత్వాలు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి, సంప్రదాయ కళల పరిరక్షణ గురించి మాట్లాడుతున్నాయి. కానీ వాటికి మూలమైన చేతివృత్తుల పరిరక్షణపై తగిన శ్రద్ధ కనబరచడం లేదు. చేతివృత్తులను కాపాడకుండా 'స్కిల్ ఇండియా' గురించి మాట్లాడటం అసంపూర్ణం. సంప్రదాయ కళలను నిలబెట్టకుండా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ గురించి చెప్పడం అర్థరహితం. ఇటీవల తెలంగాణలో నిర్వహించిన కుల గణన నేపథ్యంలో విశ్వకర్మ సమాజానికి సంబంధించిన మరో కీలక అంశం చర్చనీయాంశమైంది. విశ్వబ్రాహ్మణ–విశ్వకర్మ సమాజాన్ని ఒకే సామాజిక వర్గంగా గుర్తించకుండా కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, స్వర్ణకారులుగా విడివిడిగా నమోదు చేయడం వల్ల అసలు జనాభా గణాంకాలు స్పష్టంగా బయటపడలేదని విశ్వకర్మ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. వృత్తులు వేరైనా మూలాలు ఒక్కటే. సంప్రదాయం ఒక్కటే. సామాజిక అస్తిత్వం ఒక్కటే. పంచదాయిలు ఐదు విశ్వకర్మ సమాజం ఒక్కటే. అందుకే భవిష్యత్తులో నిర్వహించే జనగణనలో పంచ వృత్తులను "విశ్వకర్మ" లేదా "విశ్వబ్రాహ్మణ" అనే ఒకే సామాజిక వర్గంగా నమోదు చేయాల్సిన అవసరం ఉంది. కుల ధృవీకరణ పత్రాలు, ప్రభుత్వ రికార్డుల్లో కూడా అదే విధానం అమలు చేయాలి. ఇది కేవలం గుర్తింపు కోసం చేస్తున్న డిమాండ్ కాదు. నేడు జనాభా ఆధారంగానే సంక్షేమ పథకాలు, నిధుల కేటాయింపులు, అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ ప్రాతినిధ్యం నిర్ణయించబడుతున్నాయి. అసలు జనాభా నమోదు కాకపోతే ఆ వర్గానికి రావాల్సిన అవకాశాలు, ప్రయోజనాలు దూరమయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల జనాభా ప్రాతిపదికన అభివృద్ధి అవకాశాలు, రాజకీయ వాటా, నామినేటెడ్ పదవులు, సంక్షేమ పథకాలలో ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉంది. అలాగే రాష్ట్రంలోని ఇతర సామాజిక వర్గాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లే విశ్వకర్మ కార్పొరేషన్‌ను రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు, తక్షణమే దానికి చైర్మన్ ను కమిటీని నియమించాలి. సంప్రదాయ వృత్తుల ఆధునికీకరణ, మార్కెటింగ్ సదుపాయాలు, యంత్ర పరికరాల కొనుగోలు, తక్కువ వడ్డీ రుణాలు, శిక్షణా కేంద్రాలు, వృత్తి విద్యా కోర్సులను ఏర్పాటు చేసి అందులో విశ్వకర్మ నిపుణత కలిగిన అధ్యాపకులను నియమించాలి,యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం వంటి అంశాలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. ప్రత్యేక నిధులు కేటాయించి వృత్తుల పునరుజ్జీవనానికి కృషి చేయాలి. తెలంగాణ ఉద్యమ చరిత్రలోనూ విశ్వకర్మల పాత్ర విశిష్టమైనది. పీడిత జన సామాజిక విప్లవకారుడు మారోజు వీరన్న, తెలంగాణ ఆత్మకు సిద్ధాంత కర్త,బలం అందించిన ప్రొఫెసర్ కె. జయశంకర్, తెలంగాణ కోసం తన ప్రాణాలను అర్పించిన అమరుడు శ్రీకాంతాచారి వంటి మహనీయులు సమాజానికి స్ఫూర్తి నిలిచారు. తెలంగాణ సాధనలో విశ్వకర్మ సమాజానికి చెందిన అనేక మంది చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి. త్యాగాల్లో ముందున్న వర్గం గుర్తింపులో వెనుకబడేయటం సమంజసం కాదు. విశ్వకర్మలు కేవలం వృత్తిదారులు కాదు. వారు శ్రమకు ప్రతీకలు. సృష్టికి ప్రతిరూపాలు. నైపుణ్యానికి చిరునామాలు. సమాజ నిర్మాణానికి పునాదులు. వారి చేతులు పనిచేయకపోతే వ్యవసాయం ముందుకు సాగదు. వారి కళ లేకపోతే శిల్ప సంపద నిలవదు. వారి నైపుణ్యం లేకపోతే అనేక సంప్రదాయాలు అసంపూర్ణంగా మిగిలిపోతాయి.

ప్రపంచం నేడు నైపుణ్యానికి విలువ ఇస్తోంది. సంప్రదాయ కళలను సంరక్షించడానికి దేశాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. అలాంటి సమయంలో శతాబ్దాల చరిత్ర, అసాధారణ నైపుణ్యం, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర కలిగిన విశ్వకర్మల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టడం ప్రభుత్వాల బాధ్యత. ప్రభుత్వం ఇకనైనా స్పందించాలి. విశ్వకర్మ కార్పొరేషన్ పాలక మండలిని కొనసాగించాలి,జనగణనలో పంచదాయాలను ఒకే విశ్వకర్మ–విశ్వబ్రాహ్మణ వర్గంగా గుర్తించాలి. సంప్రదాయ వృత్తులను రక్షించాలి. జనాభా ప్రాతిపదికన నిధులు, అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి.

**ఎందుకంటే... వృత్తులు వేరైనా... మేమంతా దాయి ఒక్కటే విశ్వకర్మలం!**



**- గడగోజు రవీంద్రాచారి.**
**జర్నలిస్టు, రచయిత**
**9848772232 .**

# వచ్చే ఎన్నికల్లో పొత్తుల వ్యూహం మారుస్తాం

- ఒకటి, రెండు సీట్లు ఇచ్చే పార్టీలతో పొత్తుపెట్టుకోం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టుల పొత్తుల వ్యూహం పూర్తిగా మారుస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు వెల్లడించారు. ఇకపై ఒకటి, రెండు సీట్లు ఇచ్చే పార్టీలతో మేము పొత్తులు పెట్టుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గౌరవప్రదంగా కనీసం ఐదు సీట్లకు తగ్గకుండా ఇచ్చే పార్టీలతోనే రాబోయే ఎన్నికల్లో పొత్తులు ఉంటాయని ఆయన తేల్చి చెప్పారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో మినహా, మిగిలిన అన్ని సమయాల్లో కమ్యూనిస్టులంతా (సీపీఐ, సీపీఎం తదితర శ్రేణులు) ఎప్పుడూ కలిసే ఉంటామన్న కూనంనేని ప్రజా సమస్యలపై కలిసికట్టుగా పోరాడతామని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ ప్రజలకు ఉపయోగపడే, ప్రజా శ్రేయస్సు కోరే రాజకీయాలు మాత్రమే చేస్తారని కూనంనేని గుర్తుచేశారు. వ్యక్తిగత స్వార్థం, లాభాల కోసం కమ్యూనిస్టులు ఎన్నడూ రాజకీయం చేయరని.. ఒకవేళ ఎవరైనా తమ స్వార్థం కోసం రాజకీయం చేయాలని చూస్తే, వారు కమ్యూనిస్టు పార్టీలో కొనసాగడానికి ఎంతమాత్రం అర్హులు కారని ఆయన హెచ్చరించారు.




**తెలంగాణలో బీజేపీ అధికారంలో రాదు.**

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎప్పటికీ అధికారంలోకి రాలేదని జోస్యం చెప్పారు. కేవలం సెంటిమెంట్, భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలు మాత్రమే బీజేపీకి వచ్చన్నారు. కానీ అలాంటి విన్యాసాలు తెలంగాణలో అస్సలు పనిచేయవని ఎద్దేవా చేశారు. కమ్యూనిస్టుల కంచుకోట అయిన ఖమ్మం జిల్లాలో బీజేపీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "ఒక వేళ ఖమ్మంలో బీజేపీ ఒక్క సీటైనా గెలిస్తే.. నేను ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి.. రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను" అంటూ సవాల్ చేశారు.

# కాళేశ్వరంలో భక్తజన సందోహం.. క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

**మహాదేవపూర్, ముద్ర:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి పుష్కరాల ముగింపులకు ఒకేరోజు మిగిలి ఉండటంతో ఆదివారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. ఎండను దృష్టిలో ఉంచుకొని ఉదయం పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు ప్రధాన ఆలయం వద్ద బారులుతీరారు. మజ్జిగ మంచినీరు వ్యవస్థను వారు ఉచితంగా భక్తులకు అందజేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిరంతరాయంగా జరిపిస్తున్నారు.

ప్రతిరోజు ఒక స్వామీజీ రావటంతో గోదావరి తీరంలో సందడి మేలుకుంటున్నది. స్వామీజీలకు ఏర్పాటు చేసిన విడిది త్రివేణి గెస్ట్ హౌస్ లో అనేకమంది భక్తులు స్వాములను దర్శించుకోవడం పరిపాటిగా మారింది. గోదావరి తీరంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లు బోట్లలో నిత్యం పహారాకాస్తున్నారు. గోదావరి తీరంలో ఆలయ ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల కేంద్రాలను భక్తులు అస్వస్థతకు గురైన వారు చికిత్స చికిత్స వందుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది గట్టి చర్యలు చేపట్టారు. మంత్రి శ్రీధర్ బాబు పర్యవేక్షణలో బసతీయుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎస్పి సిరి శెట్టి సంకీర్త, దేవాదాయ శాఖ అధికారులు, డి ఎం అండ్ హెచ్ ఓ మధుసూదన్ లు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. ప్రతి చోట మంచినీటి సదుపాయం కల్పించిన మిషన్ భగీరథఅధికారుల భక్తులకు అందుబాటులోకి తెచ్చారు.







**కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జెన్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్**


**మహాదేవపూర్, ముద్ర:** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా జెన్కో సీఎండి కృష్ణభాస్కర్ శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఎస్. మహేష్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణ స్వాగతం పలికి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి అభిషేకం పూజలు చేశాక శుభానంద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాద మండపంలో స్వామి వారి శేషవస్త్రాలతో సన్మానం చేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్ మహేష్, చైర్మన్ మోహన్ శర్మ, ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

**సరస్వతి పుష్కరాల్లో శ్రీ మాధవానంద సరస్వతి స్వామి పుణ్యస్నానం**

సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా మెదక్ జిల్లా కొల్చారంకు చెందిన శ్రీ మాధవానంద సరస్వతి స్వామి కాళేశ్వరం చేరుకుని త్రివేణి సంఘమంలో పుణ్యస్నానం ఆచరించారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయానికి చేరుకోగా ఆలయ ఈవో మహేష్ ఆధ్వర్యంలో వేద పండితులు స్వామివారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. తర్వాత శుభానంద అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వాద మండపంలో అర్చకులు, ఆలయ అధికారులు, భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయం తరపున చైర్మెన్ మోహన్ శర్మ, ఈవో మహేష్ స్వామివారికి శేష వస్త్రాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. దేశ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, సరస్వతి పుష్కరాలకు వచ్చిన భక్తులపై అమ్మవారి, స్వామి వారి కృప ఉండాలని స్వామివారు ప్రార్థించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు.

# విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం..

**42 మందికి రూ.21 లక్షల నగదు బహుమతులు**




**ముద్ర, హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశా లల విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొం దించి, ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యం తో ప్రారంభించిన ఒక చిన్న ప్రయత్నం విశేష ఫలితాలను అందించింది. కామరాజు అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ప్రణీత్ గ్రూప్ ఎండీ నరేంద్ర కుమార్ కామరాజు ఆధ్వర్యంలో గత ఏడాది బడిచౌడి, మల్లంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, నిజాంపేట్ ప్రాంతాల్లోని ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాయి.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, క్రీడా దుస్తులు, షూలను పంపిణీ చేశారు. అంతే కాకుండా పదో తరగతి బోర్డు పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించిన ప్రతి విద్యార్థికి రూ.50 వేల నగదు బహుమతి అందజేస్తామని హామీ ఇచ్చారు.ఈ సవాల్‌ను విద్యార్థులు విజయ వంతంగా స్వీకరించి అద్భుత ఫలితాలు సాధించారు. ఐదు పాఠశాలల్లో కలిపి ఉత్తీర్ణత శాతం 83 శాతం నుంచి 92 శాతానికి పెరిగింది. ఎస్ఎస్‌సీ–2026 పరీక్షల్లో మొత్తం 42 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. పాఠశాలల వారీగా చూస్తే మల్లంపేట్ జెడ్పీహెచ్ఎస్‌లో 10 మంది, బాచుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 7 మంది, నిజాంపేట్ జెడ్పీహెచ్ఎస్‌లో 12 మంది, ప్రగతి నగర్ జెడ్పీహెచ్ఎస్‌లో 10 మంది, బడిచౌడిలోని జీహెచ్ఎస్ నయాబజార్‌లో 3 మంది విద్యార్థులు ఈ ఘనత సాధిం చారు. హామీ మేరకు 42 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున మొ త్తం రూ.21 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నారు. వచ్చే నెలలో నిర్వ హించే ప్రత్యేక సన్మాన కార్యక్రమంలో ఈ నగదు పురస్కారాలను ప్రదానం చేయ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు కృషికి తగిన గుర్తింపు లభిస్తే అసాధారణ ఫలితాలు సాధించవచ్చని మరోసారి నిరూపితమైందని ట్రస్ట్ ఎండీ నరేంద్ర కుమార్ కామరాజు పేర్కొన్నారు.

# అమరావతి అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ పై దృష్టి

**హైకోర్టు భవనాల వద్ద రూ.547 కోట్లతో మౌలికసదుపాయాలు**
**ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 61వ సీఆర్డీఏ అథారిటీ**
**18 అంశాలపై చర్చించి ఆమోదం తెలిపిన సీఆర్డీఏ అథారిటీ**



**ముద్ర, అమరావతి** : అమరావతి రాజధానిలో భవిష్యత్ నగర నిర్మాణానికి అనుగుణంగా అర్బన్ మొబిలిటీ ప్లానింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 61వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. సీఆర్డీఏ ప్రతిపాదించిన 18 అంశాలపై అథారిటీ సమావేశంలో చర్చించి ఆమోదాన్ని తెలియచేశారు. రూ.547.07 కోట్ల వ్యయంతో హైకోర్టు భవనాలకు సంబంధించిన వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. పీపీపీ ప్రాతిపదికన డిజైన్ బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో అమరావతిలో పర్యాటకానికి ప్రోత్సాహం అందించేలా జెయింట్ అబ్జర్వేషన్ వీల్ ను నిర్మించేందుకు అథారిటీ అంగీకారం తెలిపింది. ఎల్పీఎస్ లేఅవుట్లలో వీధిపోట్లు ఉంటే ప్లాట్లలో ఏటీఎంలు, కియోస్క్ లు లాంటి వివిధ మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ఆమోదం ఇచ్చింది. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ ను పీపీపీ లేదా జాయింట్ వెంచర్ విధానంలో కల్పించేందుకు అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. అలాగే నెగోషియబుల్ సెటిల్మెంట్ పాలసీలో భాగంగా అనువుగాలేని ప్లాట్లకు గ్రామకంఠంలో 5 సెంట్ల వరకూ కేటాయించేందుకు అథారిటీ అంగీకారాన్ని తెలిపింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు మార్గదర్శకాలకు అనుగుణంగా రాజధాని పరిధిలో దిగువ, మధ్యతరగతి ప్రజల నివాసానికి అనుగుణంగా గృహ సముదాయాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. అమరావతి ప్రాంతంలో భవనాలు, అక్రమ నిర్మాణాల వివాదాల పరిష్కారం కోసం ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటుకు కూడా అథారిటీ ఆమోదాన్ని తెలిపింది. వివాదాలను పరిష్కరించుకునేలా అమరావతిలో ఓ మీడియేషన్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. అమరావతి రాజధానిలో ఫైర్ వింగ్ ఏర్పాటు చేసుకుని ఎన్ఓసీలను జారీ చేసేందుకు సొంత అగ్నిమాపక నియంత్రణా వ్యవస్థ ఏర్పాటుకు కూడా అథారిటీ ఆమోదాన్ని తెలియచేసింది. రాజధాని ప్రాంతంలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటుకు సంబంధించి టాబ్రీడ్ ఒప్పందాన్ని రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలిచేందుకు అథారిటీ ఆమోదాన్ని తెలియ చేసింది. ఎల్పీఎస్ లేఅవుట్లలోని 495 మంది రైతుల కొత్త అలాట్మెంట్ కోడ్ లు మారటంతో వారికి రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపునకు అథారిటీ అంగీకారం తెలియచేసింది.

**అమరావతి ఎకనామిక్ రీజియన్ కు ఆర్ ఎఫ్ పీ**

9 జిల్లాలకు విస్తరించిన అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి సంబంధించి ప్రణాళిక రూపకల్పన కోసం ఆర్ఎఫ్ పీ తయారు చేసేందుకు కూడా అథారిటీ ఆమోదాన్ని తెలిపింది. ఏలూరు నుంచి ప్రకాశం వరకూ 9 జిల్లాల్లో అభివృద్ధి ప్రణాళికల్ని రూపొందించేలా అథారిటీ సమావేశంలో సీఎం ఆదేశాలు జారీ చేశారు. రాజధానిలోని అన్ని భవనాలు, కార్యాలయాలకు ఓ సెంట్రల్ కూలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎం నిర్దేశించారు. డక్ట్ ల ద్వారా పైపుల నుంచి ఇళ్లు, కార్యాలయాలకు ఇది చేరేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బల్క్ చిల్లింగ్ యంత్రాల తయారీ సంస్థలు ఏపీలో ఉన్నాయని వీటిని సమర్థంగా వినియోగించుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. బ్లూ గ్రీన్ సిటీగా నిర్మితం అవుతున్న అమరావతిలో కొత్త సాంకేతిక వ్యవస్థలపై విస్తృతమైన అవగాహన కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. అమరావతి రాజధాని ప్రాంతంలో నిర్మితం అయ్యే ప్రతీ టౌన్ షిప్ లోనూ వర్క్ ఫ్రమ్ హోమ్ సహా లివబుల్, కమర్షియల్ కార్యకలాపాల కేంద్రాలుగా ఉండాలని సూచించారు. రాజధాని ప్రాంతంలో ఎకనమిక్ యాక్టివిటీ ఉండేలా ప్రణాళికలు ఉండాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో నిర్మించే ఆస్పత్రుల్లో రోగుల అటెండెంట్లకు కూడా వసతి ఉండేలా చూడాలన్నారు. రాజధాని ప్రాంతంలో హోటళ్లు, కన్వెన్షన్ కేంద్రాలను వేగంగా అందుబాటులోకి తేవాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశానికి పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, సీఎస్ జి. సాయి ప్రసాద్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఏడీసీ, సీఆర్డీఏ అధికారులు హాజరయ్యారు


సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 01-06-2026
www.mudranews.in | @mudranews



### మజ్జిగ బరువు తగ్గడానికి సహాయపడుతుంది

మజ్జిగలో కేలరీలు మరియు కొవ్వు చాలా తక్కువగా ఉంటాయి, కానీ పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇది తాగడం వల్ల కడుపు నిండినట్లు అనిపించి, అనవసరమైన ఆహారం తినకుండా బరువు తగ్గడానికి సాయపడుతుంది.

### సీపీఆర్‌తో నవజాత శిశువుకు
## ప్రాణం పోసిన 108 సిబ్బంది



**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** శ్వాస సమస్యతో బాధపడుతున్న ఓ నవజాత శిశువును 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో సీపీఆర్ చేసి ప్రాణాపాయం నుంచి కాపాడారు. కొడంగల్ నియోజకవర్గంలోని తుంకి మెట్ల గ్రామానికి చెందిన భువనేశ్వరి మూడు రోజుల క్రితం తాండూర్ మాతా శిశు ఆసుపత్రిలో బాబుకు జన్మనిచ్చింది. శిశువుకు శ్వాస సమస్య రావడంతో వైద్యులు హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గ మధ్యంలో చిన్నారి పరిస్థితి విషమించడంతో ఈఎంటి శాంత్‌కుమార్, పైలట్ అయూబ్ పాషా సిపిఆర్ నిర్వహించి శ్వాసను పునరుద్ధరించారు. అనంతరం శిశువును క్షేమంగా నీలోఫర్ ఆసుపత్రికి చేర్చారు. చిన్నారి ప్రాణాలను కాపాడిన 108 సిబ్బందికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలపగా, వారి సేవలను పలువురు అభినందించారు.

## కాప్రా డివిజన్‌లో రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం






**ముద్ర, కాప్రా:** కాప్రా డివిజన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో సుమారు రూ.4 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి కాలనీలో మెరుగైన సౌకర్యాలు కల్పించి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో సీనియర్ సిటిజన్ కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులు, సాకేత్ కాలనీలో రూ.25 లక్షలతో ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటు, వోర్లా ఎన్‌క్లేవ్‌లో రూ.60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, కాప్రా నాలా నుంచి సాయి సుమా టీ-జంక్షన్ వరకు రూ.2.50 కోట్లతో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం, గాంధీనగర్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బైరి నవీన్ గౌడ్, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### అను ఫుడ్ కోర్ట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఈసీఐఎల్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన "అను ఫుడ్ కోర్ట్" ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ఫుడ్ కోర్ట్‌ను ప్రారంభించి యజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించే ఇలాంటి సంస్థలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో అడుగుపెడుతున్న యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు , బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు నారాయణపేట పట్టణ బంద్

### విశ్వహిందూ పరిషత్ పిలుపు

**ముద్ర, నారాయణ పేట :** లవ్ జిహాదీ బారిన పడి నారాయణపేట జిల్లా కేంద్రంలోని కురువ గేరికి చెందిన బాలిక (15) ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనను నిరసిస్తూ సోమవారం నారాయణపేట పట్టణ బంద్ కు పిలుపు నిచ్చినట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు మురళి భట్టడ్, బజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షుడు వడ్ల శ్రావణ్ కుమార్, కడుదాస్ ప్రవీణ్ లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడికి కఠిన శిక్ష విధించాలన్నారు. నిష్పక్షపాతంగా న్యాయ విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీసి నిందితుడిని అరెస్టు చేయాలని అలాగే బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో ఉధృతమైన నిరసనలు కొనసాగిస్తామన్నారు. బందుకు జిల్లా కేంద్రంలోని వ్యాపార యజమానులు, ప్రైవేటు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అందరూ సహకరించాలని కోరారు.

## ముగిసిన రేణుక ఎల్లమ్మ తల్లి జాతర



**ముద్ర, తాండూరు ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గ పరిధిలోని కొతలపూర్ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈనెల 1వ తేదీ నుండి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి రథోత్సవం, శిడే కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది. నెల రోజులపాటు జాతర ఉత్సవాలు కొనసాగాయి. చివరి రోజు పౌర్ణమి ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు హాజరై అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

### 4, 5 తేదీల్లో
### సీఎం రేవంత్ పర్యటన

**ముద్ర, మహబూబ్ నగర్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు ప్రత్యేక హెలికాప్టర్ లో ఈనెల 4న జిల్లాకు రానున్నారు. ముందుగా మక్తల్ నియోజకవర్గానికి చేరుకొని అక్కడ నూతనంగా చేపట్టిన మక్తల్.. నారాయణపేట.. కొడంగల్ ఎత్తిపోతల పనుల పరిస్థితులు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణానదిపై నిర్మించ తలపెట్టిన బ్యారేజీల స్థితిగతులను చూసి జూరాల వద్దకు చేరుకుంటారు.

అక్కడ జూరాల స్థితిగతులను ముఖ్యమంత్రి స్వయంగా చూస్తారు. వీటితో పాటు మరికొన్ని ఎత్తిపోతలు, ప్రాజెక్టులకు సంబంధించి అధికారులను అడిగి తెలుసుకుంటారు. నాలుగో తేదీ రాత్రి కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలకు చేరుకొని అక్కడే బస చేసే అవకాశం ఉంది. 5వ తేదీన పాలమూరు.. రంగారెడ్డి ప్రాజెక్టుల్లో భాగంగా నిర్మించిన రిజర్వాయర్లను పరిశీలిస్తారు. ఈ సందర్భంగా బహిరంగ సభను నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఖరారైన నేపథ్యంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదివారం భూత్పూర్ మండలం కరివేన రిజర్వాయర్ ను ఇరిగేషన్ సీఈలు సత్యనారాయణ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి తదితర అధికారులతో కలిసి పరిశీలించారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని జీఎంఆర్ తెలిపారు.

### పియంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల
## విద్యార్థినికి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు



**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని పియంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నడిగడ్డ కీర్తి బాసర ట్రిపుల్ ఐటీలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బి.టెక్ కోర్సులో ప్రవేశానికి ఎంపికైంది. ఈ ఏడాది ప్రవేశ ఫలితాల్లో సీటు సాధించిన కీర్తి పాఠశాలకే కాక గ్రామానికీ గర్వకారణంగా నిలిచింది. వరుసగా మూడు సంవత్సరాలుగా ట్రిపుల్ ఐటీ సీట్లు సాధిస్తున్న ఏకైక పాఠశాలగా పియంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి విద్యార్థినిని అభినందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలే ఈ విజయాలకు కారణమని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు కీర్తిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## రామాలయంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు



**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో అధిక జ్యేష్ఠ మాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం శాస్త్రోక్తంగా శ్రీ సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఎనిమిది మంది దంపతులు ఈ వ్రతాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ వేద మంత్రోచ్చారణల మధ్య వ్రత కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచనం, తీర్థప్రసాదాల పంపిణీ చేపట్టారు. రామాలయం అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యంలో భక్తులందరికీ సామూహిక అన్నప్రసాదం పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు అర్థం రవీందర్, టి. మల్లేష్, ఓ. శ్రీను, టి. యాదగిరి, నందకిశోర్, గొల్ల రాములు, ప్రదీప్, శిరీష, రమాదేవి, యాదమ్మ, భాగ్యమ్మతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## ఆస్తి కోసం తండ్రిపై కొడుకు దాడి

**ముద్ర, మహబూబ్ నగర్:** తల్లిదండ్రులు జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తిని పిల్లల భవిష్యత్తు కోసం పంచిపెడతారు. వృద్ధాప్యంలో తమకు అండగా ఉంటారనే ఆశతో పెంచిన పిల్లలే చివరకు తమపై చేయి చేసుకుంటే ఆ తల్లిదండ్రుల గుండె ఎంతగా ముక్కలవుతుందో ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది. ఆస్తి కోసం కన్న తండ్రి పైనే కొడుకు దాడికి దిగిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలో తీవ్ర కలకలం రేపింది. మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు పోకల కృష్ణయ్య తన జీవితకాల సంపాదనను ఇద్దరు కుమారులకు సమానంగా పంచి ఇచ్చాడు. పిల్లలు సుఖంగా ఉండాలని భావించిన ఆ తండ్రికి, వృద్ధాప్యంలో ప్రేమాభిమానాలు దక్కాల్సిన సమయంలో చేదు అనుభవం ఎదురైంది. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లో నివాసముంటున్న పెద్ద కుమారుడు లక్ష్మణ్ కుమార్ తన భార్య సరస్వతితో, ఓ స్నేహితుడితో కలిసి ఇంటికి వచ్చి గొడవకు దిగినట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇంటి ముందు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, అసభ్య పదజాలంతో దూషిస్తూ ఇంట్లోకి దూసుకొచ్చిన తన కుమారుడు తనపై దాడి చేశారని కృష్ణయ్య వాపోయాడు. బెల్టుతో విచక్షణారహితంగా కొట్టడంతో తనకు తీవ్ర గాయాలయ్యాయని, వృద్ధాప్యంలో ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఎన్నడూ ఊహించలేదని కన్నీటి పర్యంతమయ్యాడు. "నిన్ను ఎన్నటికైనా చంపేస్తా" అంటూ బెదిరింపులకు కూడా పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాడి సమయంలో వృద్ధుడు సహాయం కోసం కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పరుగెత్తుకుంటూ వచ్చి ఆయనను రక్షించారు. లేకపోతే పరిస్థితి మరింత విషమించేదని స్థానికులు చెప్పారు. కన్న కొడుకే కసాయిగా మారి తండ్రిపై దాడి చేయడం గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆస్తి ఇచ్చిన తండ్రికే ఈ పరిస్థితి వస్తే సమాజం ఎటు వెళ్తోందంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులపై పెరుగుతున్న దాడులు, కుటుంబ బంధాలు క్షీణిస్తున్న తీరుపై ఆందోళన వ్యక్తమవుతోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై జనార్ధన్ తెలిపారు.

## 'ఉపాధి' కార్మికుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలు




**ముద్ర, రంగారెడ్డి:** ఉపాధి హామీ కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్ రాములు విమర్శించారు. జూన్ 20, 21, 22 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యాలాల మండల కేంద్రంలో మహాసభల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, భూమి లేని పేదలకు భూముల పంపిణీ, వ్యవసాయ కూలీలకు కనీస వేతనాల పెంపు, ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధుల కోతలు, యంత్రాల వినియోగం వంటి చర్యలతో చట్టాన్ని బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. భూసేకరణ పేరుతో పేదలు, చిన్న రైతుల భూములను స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ, గ్రామీణ పేదల హక్కులు, సామాజిక న్యాయం, ఉపాధి, భూమి సమస్యలపై మహాసభల్లో విస్తృత చర్చ జరగనుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శి యు.బుగ్గప్ప, ఎం.వెంకటయ్య, కేవీపీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.మహిపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్, కోశాధికారి బుస్స చంద్రయ్య, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### మహబూబ్ నగర్ డీఈవోగా విజయకుమారి



**ముద్ర, మహబూబ్ నగర్:** మహబూబ్ నగర్ నూతన డీఈవోగా మేడ్చల్ డీఈవోగా పనిచేస్తున్న విజయ కుమారిని నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్ నగర్ డీఈవోగా పనిచేసిన ప్రవీణ్ కుమార్ పలు ఆరోపణలతో దీర్ఘకాలిక సెలవులలో వెళ్లారు. ఈ నెల 30తో ఆయన సెలవులు ముగియడంతో సూర్యాపేట ఏడీగా చేరనున్నట్లు సమాచారం. ప్రస్తుతం మేడ్చల్ డీఈ వోగా పనిచేస్తున్న విజయ్ కుమారిని మహబూబ్ నగర్ డీఈవోగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం విజయ కుమారి మహబూబ్ నగర్ డీఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఫోటోగ్రాఫర్ మృతి

**ముద్ర, రంగారెడ్డి:** కారు చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు కడ్తాల్ సీఐ సైదిరెడ్డి తెలిపారు. మండలంలోని మక్తమాదారం గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేశంపేట్ మండలంలోని ఏక్లాస్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన యువ ఫోటోగ్రాఫర్ బోడనంపల్లి శివ(23) మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. శివ తన స్నేహితులతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా.. డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టినట్లు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో యువకుడు చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 01.06.2026
www.mudranews.in | @mudranews



**మజ్జిగ:**

ఎముకల బలానికి మేలు



మజ్జిగలో కాల్షియం, విటమిన్ డి పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఎముకలను, పళ్లను బలంగా ఉంచడమే కాకుండా ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యల బారిన పడకుండా చూస్తాయి.

# సుడా రెండేళ్ల ప్రగతి అద్భుతం

**- రెండేళ్ల ప్రగతి పై నేటి నుంచి 15 వరకు పక్షోత్సవాలు**

**- ముఖ్య అతిథులతో త్వరలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**- సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్:** శాతవాహన అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ రెండేళ్లలో అద్భుతమైన ప్రగతి సాధించిందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెల్లడించారు. శనివారం నగరంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మునుపెన్నడూ లేనంతగా అభివృద్ధి జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంకా మరింత ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే సుడా పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, హైమాస్ట్ లైట్లు, కూడళ్ల సుందరీకరణ తదితర పనులు చేపట్టామన్నారు. సుడాకు గతంలో గజం జాగ కూడా లేదని, 800 గజాల్లో రూ. 5 కోట్లతో కమర్షియల్ బిల్డింగ్ నిర్మిస్తున్నామని చెప్పారు. ఇరువై ఏళ్ల క్రితం నిర్మించి వదిలేసిన ఐడీఎస్ఎంటీ మురికి కూపమై అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. దాన్ని రూ.కోటి న్నరతో అభివృద్ధి చేసి ఇప్పుడు త్వరలో అందు బాటులోకి తీసుక రాబోతున్నామన్నారు. టవర్ ఏరియాకు వచ్చే వారికి వంద కార్లు, మూడు వందల బైకులు పార్కింగ్ చేసుకోవడానికి అందుబాటులోకి వస్తుందన్నారు. 40 షెట్టర్లు ఆధునీకరించామని, వాటిని అద్దెకిస్తామన్నారు. ఐడీఎస్ఎంటీ వెనుక రూ.కోటి ఇరవై లక్షలతో ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు టెండర్లు పిలిచామన్నారు. త్వరలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. రాజీవ్ చౌక్ ను సుందరీకరించి 9 ఫీట్ల రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలో ముఖ్య అతిథులతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 1 నుంచి 15 వరకు సుడా ప్రగతి పై పక్షోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ప్రతి రోజు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. రూ. ఏడున్నర కోట్ల నూతన పనులకు టెండర్లు పిలిచామన్నారు. అవి కూడా త్వరలో శంఖుస్థాపన చేస్తామని తెలిపారు. ఈ పక్షోత్సవాల్లో అందరిని భాగస్వాములను చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎండీ తాజ్, చాడగొండ బుచ్చిరెడ్డి, టేల భూమయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, గుడిపాటి రమణారెడ్డి, మిర్యాల శ్రీధర్ రెడ్డి, జువ్వాడి అమరేందర్ రావు, కుర్ర పోచయ్య, దండి రవీందర్, జీడి రమేష్, మాసుంఖాన్, బషీర్, ఖలీల్, హనీఫ్, అంజయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.


## ఆవిర్భావ దినోత్సవానికి అతిథిగా శ్రీనివాస్ రెడ్డి



**మహదేవపూర్, ముద్ర:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకారున్నారు. జిల్లా కేంద్రంలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అతిథులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుండగా, యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

# కుల వృత్తుల అభివృద్ధికి కృషి

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** కుల వృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలో నిర్వహించిన మేరు సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే హాజరై హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేరు కుల సంఘం ఉన్నతికి తాను కృషి చేస్తానన్నారు. మేరు సంఘం అభివృద్ధకి గతంలో రూ.12లక్షలు నిధులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన లో మేరు కులాన్ని గుర్తించి జీవో కూడా ఇచ్చిందన్నారు. మేరు సొసైటీ ఏర్పాటు చేసి చైర్మెన్, వైస్ చైర్మన్ కూడా నియమించామన్నారు. జగిత్యాల నియోజకవర్గం లో తన గెలుపునకు కృషి చేసిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణ పడి ఉంటానని పేర్కొన్నారు.

**అత్యధిక డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం..**

జగిత్యాల లో అత్యధిక డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. మౌలిక సదుపాయాలు కల్ప న కోసం రూ.40 కోట్ల తో పనులు చేపట్టి నట్లు చెప్పారు. మరింత అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తాన న్నారు. జగిత్యాల పట్టణ అభివృద్ధికి రూ.62.5 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మేరు సంఘం అభివృద్ధికి రూ.5 లక్షలు మం జూరుకు కృషి చేస్తానన్నారు. మన మతాన్ని, కులాన్ని మనం ప్రేమిస్తూ ఇతర కులాలు, మతాలను మనం గౌరవించాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్టం, దేశం ముందుకు పోతుందని తెలిపారు. ఈ విషయాన్ని సమాజంలోని అన్ని వర్గాలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. తమ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ అడువల జ్యోతి లక్ష్మ ణ్, మాజీ కౌన్సిలర్ దాసరి లావణ్య ప్రవీణ్, సంఘం అధ్యక్షుడు రాపర్తి వినోద్, ప్రధాన కార్యదర్శి గట్ల శ్రీనివాస్, ఉప అధ్యక్షుడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి రా యిళ్ల శ్రీధర్, కోశాధికారి గట్ల శ్రీకర్, మాజీ అధ్యక్షుడు మల్లేశం, సభ్యులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పోలీసు యాక్ట్ అమలు

**- ఎస్పీ జానకి షర్మిల**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా సోమవారం నుంచి నెలాఖరు వరకు కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, పోలీస్ ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదన్నారు. నిషేధిత ఆయుధాలు, తుపాకులు, పేలుడు పదార్థాలు వాడరాదని తలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే కార్యక్రమాలు, లౌడ్ స్పీకర్లు, డీజేలు కూడా వాడరాదని స్పష్టం చేశారు. జిల్లాలోని ఏ ప్రాంతంలో కూడా నిబంధనలను ఎవరు ఉల్లంఘించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# వరి కొయ్యలను కాల్చివేయొద్దు

**- కలెక్టర్ సత్యప్రసాద్**




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** రైతులు తమ పంట అవశేషాలను, ముఖ్యంగా వరి కొయ్యలను కాల్చివేయొద్దని కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో సూచించారు. పంట అవశేషాలను కాల్చడంతో పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూసారం తగ్గిపోతుందన్నారు. మానవ ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ కార్బన్, ఉపయోగకర సూక్ష్మజీవులు, వానపాములు నశించి భూమి సారవంతత క్షీణిస్తుందని పేర్కొన్నారు. పంట అవశేషాల దహనం కారణంగా మంటలు అదుపు తప్పి సమీపంలోని ఆయిల్ పామ్, మామిడి తోటలు, ఇతర పంట పొలాలకు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. దీనివల్ల రైతులు గణనీయమైన ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో పొడి వాతావరణ పరిస్థితుల కారణంగా మంటలు వేగంగా వ్యాపించి సమీప వ్యవసాయ భూములను దెబ్బతీసే అవకాశం ఉన్నందున రైతులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అదే విధంగా, పంట అవశేషాల దహనం వల్ల సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు. విద్యుత్ సరఫరా తీగలు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. దీనివల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు ప్రజలు, రైతులు, విద్యుత్ సిబ్బందికి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రజా ఆస్తుల రక్షణ దృష్ట్యా రైతులు పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను. పంట అవశేషాలను తగలబెట్టడం నిషేధించబడిందన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం రూ.5,000 నుండి రూ.25,000 వరకు జరిమానా విధించడంతో పాటు అవసరమైతే ఇతర చట్టపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతులు పంట అవశేషాలను పొలంలోనే కలియదున్ని, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వంటి ఎరువులను వినియోగించడం ద్వారా వాటిని త్వరగా కుళ్లిపోయేలా చేసి సేంద్రియ ఎరువులుగా మార్చుకోవచ్చని సూచించారు. ఈ విధానం ద్వారా నేలలో పోషకాలు పెరిగి తదుపరి పంటలకు అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంట అవశేషాల శాస్త్రీయ నిర్వహణపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పర్యావరణ, భూసార, ప్రజారోగ్య పరిరక్షణతో పాటు సమీపంలోని ఆయిల్ పామ్, మామిడి తోటలు, ఇతర పంటలు, విద్యుత్ మౌలిక వసతులను అగ్ని ప్రమాదాల నుంచి కాపాడేందుకు పంట అవశేషాల దహనానికి పూర్తిగా దూరంగా ఉండాలని కలెక్టర్ జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

## ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల మండలంలోని గుమ్లా పూర్ లో ఆదివారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనేక నెలలుగా గ్రామంలో నెలకొన్న చిన్నపాటి కారణాలతో ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ వాయిదా పడింది. గ్రామ ప్రజలు ముకుమ్మడిగా నిర్ణయం తీసుకొని ఆదివారం నాయకులతో సంబంధం లేకుండా సర్పంచ్, గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రౌట్ల స్రవంతి శ్రీకాంత్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనూఫ్ రావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల తుకారాం గౌడ్, పలు గ్రామాల సర్పంచ్ లు, బీజేపీ నాయకులు బూత్ కమిటీ అధ్యక్షుడు తునికి ప్రశాంత్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలి




**ముద్ర, కోరుట్ల:** యువత క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ సూచించారు. పట్టణంలోని జీజీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కరాటే బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నరు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బెల్ట్స్ ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్య సాహసాలను పెంపొందిస్తాయన్నారు. ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థి చదువుతో పాటు శారీరక దృఢత్వం, స్వీయ రక్షణ నైపుణ్యాలను కూడా అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబర్చి కోరుట్లకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆసక్తి పెంచుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

## ఈత వనాల పరిరక్షణకు బోర్ వెల్స్ మంజూరు

**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల నియోజకవర్గంలోని మెట్లచిట్టాపూర్, పెద్దాపూర్, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో ఈత వనాల పరిరక్షణకు బోరువెల్ పంప్‌సెట్లు ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ బి. సత్యప్రసాద్ రూ.ఆరు లక్షలు మంజూరు చేశారు. మూడు గ్రామాల్లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదాల కారణంగా ఈత వనాలు భారీగా దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈత వనాల పునరుద్ధరణకు, భవిష్యత్తులో అగ్నిప్రమాదాలను ఎదుర్కొనేందుకు అవసరమైన నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కలెక్టర్ బి. సత్యప్రసాద్ ను కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా సంబంధిత గ్రామాల గౌడ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కలెక్టర్ బి. సత్యప్రసాద్ కు ధన్యవాదాలు తెలిపారు. తమ సమస్యను వెంటనే గుర్తించి పరిష్కార మార్గం చూపినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ నిర్ణయం వల్ల ఈత వనాల పరిరక్షణతో పాటు భవిష్యత్తులో అగ్నిప్రమాదాల సమయంలో తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

## బొడ్రాయి ఏర్పాటుకు భూమిపూజ



**ముద్ర, కరీంనగర్:** హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌లో భూలక్ష్మి, మహాలక్ష్మి సహిత బొడ్రాయి ఏర్పాటుకు సర్పంచ్ పోలు సంపత్ భూమి పూజ నిర్వహించారు. కొత్తగా నిర్మించిన దేవాలయంలో జూన్ 16, 17, 18 తేదీల్లో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠతో పాటు బొడ్రాయిని ప్రతిష్ఠించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ ఉత్సవాల విజయవంతం కోసం ఓ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. భూమి పూజలో మాజీ వైస్ ఎంపీపీ రామ్ గోపాల్ రావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు జనగామ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

సోమవారం 01.06.2026

www.mudranews.in | @mudranews



**మజ్జిగ : రక్తపోటును అదుపులో ఉంచుతుంది**



మజ్జిగలో ఉండే ప్రత్యేక పొటాషియం మరియు కొన్ని రకాల ప్రొటీన్లు బీపీని అదుపులో ఉంచుతాయి. క్రమం తప్పకుండా మజ్జిగ తాగడం వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

## టెండర్లు వేయాలని గుట్టలో మహా ధర్నా



**ముద్ర, యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేసి టెండర్లు వేయాలని కోరుతూ ఆదివారం యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట తాసిల్దార్ కార్యాలయం నుండి పాతగుట్ట చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి బస్టాండ్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యాక్రమాన్ని ఉద్దేశించి కమిటీ సభ్యులు మాట్లాడుతూ యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాన్ని రద్దుచేసి టెండర్ వేస్తే దేవస్థానానికి 20 నుండి 30 కోట్ల ఆదాయము సమకూరుతుందని భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించవచ్చునని అన్నారు . స్థానిక నిరుద్యోగులకు ఉపాధి వస్తుందన్నారు. కొండపైన ఉన్నటువంటి 10 తాత్కాలిక దుకాణాలకు గడువు చివరి రోజు కావున ఇప్పటివరకు ఎటువంటి రెన్యువల్ నోటిఫికేషన్ రాలేదని ఒకవేళ టెండర్ వేయకుండా రెన్యువల్ చేసినట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని, ఆమరణ నిరాహార దీక్ష కైనా కమిటీ సభ్యులు సిద్ధమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు, పల్లపు బాలయ్య, బండ రామస్వామి, దేవపూజ అశోక్,గ్యాదపాక బాల నరసయ్య, బుగ్గా ఆంజనేయులు, అరె స్వామి,మాటూరి బాలయ్య,దండబోయిన వీరేష్,బండి అనిల్, ముక్కెర్ల వెంకటేష్, కొన్నె సంజీవ , గోపగాని ప్రసాద్,దొమ్మాట ప్రభాకర్, మందోజు నరేష్, కర్రె ప్రవీణ్ ,గుండు కుమార్,వాల్మీకి అజయ్,గ్యాదపాక క్రాంతి, గౌడ శ్రీశైలం, పసుపునేటి మురళి,కంబాల సత్యం,ముక్కెర్ల పెద్ద రాజు, రాజశేఖర్, బండ శేఖర్,శ్రీనాథ్, నరేష్, విజయ్, రమేష్, నవీన్, ప్రవీణ్, సాయి, మణి పాల్గొన్నారు.

## 30వ వార్డులో బోరు పనులు ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలోని 30వ వార్డు పహడినగర్ లో తాగునీటి సమస్య పరిష్కారానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ఆదివారం బోరు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాలతో, కౌన్సిలర్ ఎండీ.లయిక్ అహ్మద్ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. ఈ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వార్డులో నీటి కొరత తీర్చేందుకు బోరు వేశామని ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే మా లక్ష్యం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ అహ్మద్, ఎండీ.జబ్బర్, రామాచారి అహ్మద్ బబ్బు, ఎండీ.బషీర్, మహబూబ్, మన్సూర్, సల్మాన్ ఖాన్, జహంగీర్, సుల్తాన, ఎండీ.అరిఫ్, వార్డ్ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

## తొలిదశ ఉద్యమకారునికి ఘనసన్మానం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పీడీ యాక్ట్ అనుభవించిన తొలిదశ ఉద్యమకారుడు పులిమామిడి బాలకృష్ణారెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు పూస శ్రీనివాస్, సహాధ్యక్షుడు కొడిమాల కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లగురుగుల రఘుబాబులు అన్నారు. ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సంఘం ముఖ్యుల సమావేశంలో భాగంగా తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడైన పులిమామిడి బాలకృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు.

## రాజీవ్ గాంధీ విగ్రహం తొలగింపు.. వీ హనుమంతరావు ఆందోళన



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మంలో అధికారులు దివంగత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించారు. ఖమ్మం నగరంలోని కాల్వ ఒడ్డున గల మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని అధికారులు తొలగించడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు నిరసన తెలిపారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించడం దారుణమని, తొలగించిన విగ్రహాన్ని వెంటనే అదే స్థానంలో పునఃప్రతిష్ఠించాలని స్థానిక నేతలతో కలిసి వీహెచ్ హనుమంతరావు డిమాండ్ చేశారు. ముగ్గురు మంత్రులు నేతృత్వం వహిస్తున్న ఖమ్మంలో రాజీవ్ గాంధీ విగ్రహం తొలగించడం, ఆ విగ్రహాన్ని తొలగింపునకు వ్యతిరేకంగా సొంత పార్టీ సీనియర్ నేత వీ హనుమంతరావు ఆందోళన చేపట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# జావెద్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇన్ చార్జీ మీనాక్షి నటరాజన్ జావేద్ చిత్రపటానికి నివాళి అర్పించిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరరెడ్డి, అజారుద్దీన్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హన్మంతరావు, ఎంపీ రఘురామిరెడ్డి





**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** జావెద్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ నేతలు నివాళులర్పించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన టిపిసిసి సభ్యులు మహ్మద్ జావెద్ సంస్మరణ సభ ఖమ్మంలోని రెడ్ హిల్స్ కాలనీలో జరిగింది. ఏఐసిసి కార్యదర్శి, తెలంగాణ ఇన్ చార్జీ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరరెడ్డి, అజారుద్దీన్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హన్మంతరావు, ఎంపి రఘురామిరెడ్డి తదితరులు తొలుత జావెద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో ఎఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఖమ్మం నగరానికి చెందిన వారినే కాదు, దేశంలో చాలామంది స్నేహితులను జావెద్ వదిలి వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన నాయకుల జాబితాలో జావేద్ భాయ్ పేరు కూడా ఉందన్నారు. ఆయనకు పదవి వచ్చే సమయంలో ఆక్సిడెంట్ లో ఆయన మరణించటం దురదృష్టకరమన్నారు. ఇద్దరు కూతుర్లకు జావేద్ భాయ్ మంచి సంస్కారం నేర్పించారని, తండ్రి స్థానాన్ని ఎవరు పూడ్చలేరని కాని వారి కుటుంబాన్ని ఒంటరిగా విడిచిపెట్టం అని పార్టీ వారికి అండగా ఉంటుందన్నారు. మనిషిని గుర్తు పట్టడం అంటే ఆయన చేసిన పనులను గుర్తు పట్టడమే అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జావేద్ భాయ్ చనిపోయే రెండు రోజుల ముందు ఆయనకు సన్మానం చేశానని ఆయన బ్రతికి ఉంటే వచ్చే నెల ఆయనకి సత్కార సభ జరిగేదని దురదృష్టవశాత్తు సంతాప సభ జరపవలసివచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. నామినేటెడ్ చైర్మన్లు ఇచ్చే లిస్ట్ లో జావేద్ పేరు రాపించాం కాని పదవి వరించేలోపే ఆయన చనిపోయాడని అన్నారు. చిన్న తప్పిదం సీటు బెల్ట్ అనేది ఎంతమంది ప్రాణాలు రక్షిస్తుంది, ఆయన ఆ రోజు సీటు బెల్ట్ పెట్టుకోలేదని అన్నారు. కమిట్మెంట్ తో పని చేసే వ్యక్తిని పార్టీ కోల్పోవడం కాంగ్రెస్ పార్టీ కి దురదృష్టకరం అని బ్రతికి ఉండి ఉంటే మరి 30 ఏళ్ళు రాజకీయాల్లో ఉండేవాడని అన్నారు. జావేద్ భాయ్ లేని లోటు కచ్చితంగా కనపడుతుందని, ఆయన చేసిన సేవలు మర్చిపోలేనివి, ఈ రోజు ఆయన లేని లోటు కనపడుతుంది వారి కుటుంబానికి, కూతుళ్ళకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. జావేద్ భాయ్ కి కాంగ్రెస్ పార్టీ రుణపడి ఉంటుంది వారి కూతురికి సంపూర్ణగా మద్దతు ఇస్తాం అని జావేద్ కు మనస్ఫూర్తిగా జోహార్లు అర్పించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నేను రాజకీయాల్లోకి వచ్చినప్పుడు జావేద్ కాంగ్రెస్ పార్టీ లోనే ఉన్నాడు, నేను బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు పార్టీలోకి ఆహ్వానిస్తే తను పుట్టింది పెరిగింది చచ్చేది కాంగ్రెస్ పార్టీలోనే అన్నాడని అంతటి కమిట్మెంట్ లీడర్ జావెద్ అని నివాళులు అర్పించారు. మా అందరి గెలుపులో ఆయన భాగస్వామి అయ్యాడని , పార్టీ అధికారంలోకి వచ్చింది, జూన్ లో ఎట్టి పరిస్థితుల్లో జావేద్ కు పదవి ఇవ్వాలని అనుకున్నాం. సన్మాన కార్యక్రమం జరుపుకోవాల్సిన జావేద్ భాయ్ మనందరికీ దూరం అయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ లో పార్టీ తాము కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జావెద్ అకాల మరణం, ఊహించని సంఘటన బాధించే విషయం అన్నారు. ఎంపి రఘురామ్ రెడ్డిని, నన్ను పరిచయం లేకపోయినా పార్టీ ఆదేశానుసారం మా గెలుపుకు కృషి చేశాడని గుర్తు చేసుకున్నారు. సరైన సమయానికి ఆయనను కోల్పోవడం పార్టీకి, మనందరికీ నష్టం కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మేము పార్టీలో సభ్యులుగా పార్టీ నిర్ణయానికి కట్టుబడి వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో జావెద్ కుమార్తెలు షాహెలా జావెద్, మదిహా జావెద్, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. సభ కు కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలి వచ్చి జావెద్ కు నివాళులు అర్పించారు.

# తెలుగు జాతి ఆత్మగౌరవం ఎన్టీఆర్

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత నందమూరి తారక రామారావు అని, ఆయన చూపిన సేవా స్ఫూర్తితో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ఖమ్మంలోని స్వర్ణభారతి కమ్మ వారి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఒక వ్యక్తి కాదని, తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత అని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన అమలు చేసిన పథకాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని, సామాజిక బాధ్యతతో కమ్మ మహాజన సంఘం చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని మంత్రి తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిం చడం ద్వారా సమాజానికి మరింత మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ శిబిరంలో కాన్సర్, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, చర్మవ్యాధులు, నేత్ర, స్త్రీరోగ, శిశు, ఈఎన్‌టీ, యూరాలజీ, న్యూరో తదితర విభాగాలకు చెందిన ప్రముఖ వైద్యులు సేవలు అందించారు. అలాగే రక్తపరీక్షలు, షుగర్, బీపీ, ఈసీజీ, ఎక్స్‌రే, మామోగ్రామ్ తదితర వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలకు కాన్సర్ నిర్ధారణ పరీక్షల కోసం అత్యంత విలువైన వాహనాలను, పరికరాలను సంఘం సభ్యులు బత్తినేని ప్రకాష్ సమకూర్చారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. శిబిరం విజయవంతం కావడంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఖమ్మం శాఖ, కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్, వైద్యులు, దాతలు, స్వచ్ఛంద సేవకులు అందించిన సహకారం ప్రశంసనీయమని మంత్రి అన్నారు. కార్యక్రమం నిర్వహించిన కమ్మ మహాజన సంఘం ప్రతినిధులను మంత్రి అభినందించగా, శిబిరం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ మేయర్ నీరజ, తుమ్మల యుగంధర్ కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు కొల్లు రఘు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చావా రాము, ఉపాధ్యక్షురాలు కర్నాటి రమాదేవి, సహాయ కార్యదర్శి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలకుమారి, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, నల్లమల ఆనంద్, మేదరమెట్ల స్వరూపరాణి, డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, కోలేటి నవీన్, నంబూరి ప్రసాద్, తాళ్లూరి మురలీకృష్ణ, బండి రవికుమార్, బతినేని ప్రకాశ్ పాల్గొన్నారు.

# దేవుళ్లు, మతాల పేరిట రాజకీయం చేయం

రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** దేవుళ్లు, మతాల పేరిట రాజకీయం చేయడం తమ ప్రభుత్వ విధానం కాదని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ మత సామరస్యానికి ప్రతీకగా నిలవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండల కేంద్రంలోని చారిత్రాత్మక శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం (గణపేశ్వరాలయం) పునర్నిర్మాణ, అభివృద్ధి పనులకు రూ.3.30 కోట్ల వ్యయంతో ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.లతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రతి మతం ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని కాపాడుతామని.. దేవాలయాలతో పాటు చర్చిలు, మసీదుల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఇటీవల సమ్మక్క–సారలమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడమే ఇందుకు నిదర్శనమన్నారు.గత ప్రభుత్వం భద్రాచలం ఆలయ అభివృద్ధికి వంద కోట్లు ఇస్తామని ప్రకటించి.. ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేసిందని మంత్రి విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి ఆలయ సమగ్ర రూపురేఖలు మార్చేందుకు రూ.350 కోట్లు కేటాయించి పనులకు శంకుస్థాపన చేశారని, వారం పది రోజుల్లోనే పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూసేకరణ కోసమే ఇప్పటికే రూ.68 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.1,000 కోట్లు మంజూరు చేసిందనీ, అందులో భాగంగానే గణపేశ్వరాలయ పనులను చేపట్టామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, దేవాదాయ శాఖ అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అర్చకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 01.06.2026
www.mudranews.in | @mudranews



**మజ్జిగ:**


చర్మాన్ని కాంతివంతం చేస్తుంది



మజ్జిగలోని లాక్టిక్ యాసిడ్ చర్మానికి సహజ మైన గ్లో ఇస్తుంది. దీన్ని తాగడం వల్ల చర్మం హైడ్రేట్‌గా ఉండటమే కాకుండా, ముఖానికి రాసుకుంటే ట్యాన్ తొలగిపోతాయి.

# సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి

## - జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఉద్యోగ జీవితంలో చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ గ్రేడ్ –2 లైబ్రేరియన్ కుకునూరి నరేందర్ రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు సరస్వతి నిలయాలు అన్నారు. అనేక మంది నిరుద్యోగ యువకులకు ఉద్యోగ మార్గదర్శిని అని పేర్కొన్నారు. నరేందర్ రెడ్డి తన విధి నిర్వహణలో పత్రికా, పుస్తక పఠనంతో పాటు ఎంతోమంది నిరుద్యోగులకు మార్గదర్శిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయన్స్ జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ, మాజీ అధ్యక్షుడు చంద్ర గౌడ్, మాజీ ఎంపీపీ సావిత్రి రెడ్డి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చాగంటి అయోధ్య, వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీహరి, ఎక్బాల్ పాషా, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సుదర్శన్, లైబ్రేరియన్ యాదగిరి కిషన్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, శంకర్ దయాళ్ చారి, వైద్య శ్రీనివాస్ తదితరులు సత్కరించారు.

# సైనికుడిగా ఎంపికైన చిన్నమాసన్‌పల్లి యువకుడు

**ముద్ర, హైదరాబాద్:**



సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని చిన్న మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీశాంత్ ముదిరాజ్ భారత సైన్యానికి ఎంపిక య్యాడు. గజ్వేల్‌లోని ఆజాద్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందిన శ్రీశాంత్ కృషి, పట్టుదలతో ఆర్మీలో చేరాలనే తన కలను నిజం చేసుకున్నాడు. రాయపోల్ మండలంలో ఇప్పటివరకు మొత్తం 9 మంది యువకులు భారత సైన్యానికి ఎంపికవ్వగా.. వారిలో 8 మంది ఆజాద్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందడం విశేషం. భారత సైన్యంలో సోల్జర్‌గా శ్రీశాంత్ ముదిరాజ్ ఎంపికవ్వడం పట్ల ఆజాద్ డిఫెన్స్ అకాడమీ కావడం పట్ల నిర్వాహకులు చైర్మన్ నీల చంద్రం (రిటైర్డ్ ఆర్మీ ) సంతోషం వ్యక్తం చేశారు. తమ అకాడమీలో గ్రామీణ యువతకు నాణ్యమైన శిక్షణ అందించడం ద్వారా దేశ సేవకు అవకాశం కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. శ్రీకాంత్ సైన్యంలో ఉద్యోగం సాధించడంతో కుటుంబ సభ్యులు, చిన్న మాసన్‌పల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీశాంత్ ముదిరాజ్ సాధించిన విజయం పట్ల గ్రామ పెద్దలు, యువకులు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు. సైన్యంలో చేరనున్న శ్రీకాంత్ మరెంతో మంది యువతకు ఆదర్శంగా నిలవాలని వారంతా ఆకాంక్షించారు.

# కాకతీయ కాలువకు నీటిని విడుదల చేయాలి

**ముద్ర, హైదరాబాద్:** బాల్కొండ నియోజకవర్గంలోని కాకతీయ కాలువ వెంబడి ఉన్న గ్రామాల రైతులు పసుపు పంట సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు లీకేజ్ నీటిని వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏడాది పొడవునా కాకతీయ కాలువలో నీరు నిల్వ ఉండేదని, దీంతో రైతులు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సాగు చేసుకునేవారన్నారు. ప్రస్తుతం కాలువలో పూర్తిగా నీరు లేక రైతులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఎస్సారెస్పీలో ప్రస్తుతం తగినంత నీటి నిల్వలు ఉన్నందున రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. పసుపు పంట సాగుకు ఇది కీలక సమయమని, ప్రభుత్వం, సాగునీటి శాఖ అధికారులు వెంటనే స్పందించి లీకేజ్ వాటర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# ధాన్యం మిల్లులకు త్వరగా తరలించాలి

## - కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** రైతుల నుంచి సేకరించిన ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులు, గోదాములకు త్వరగా తరలించేలా చర్యలు తీసుకో వాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు. సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ధాన్యం తరలించేందుకు సరిపడా వాహనాలు సమకూర్చాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 65,116 మంది రైతుల నుంచి 3,11,238.640 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 47,463 మంది రైతులకు రూ. 512.87 కోట్లు ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇప్పటివరకు 40 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించి ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ ద్వారా ముందుకు పోతున్నామన్నారు. రైతులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలన్నారు. ధాన్యం లోడింగ్ చేయడం కోసం హమాలీల సంఖ్య పెంచాలన్నారు.

# ధాన్యం తరలించకుంటే ఆందోళన చేస్తాం..



**ముద్ర, హైదరాబాద్:** కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించకుంటే రైతులతో కలిసి ధర్నా చేస్తామని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని తెలిపారు. ఆయన నిజామాబాద్ జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద, కన్నారెడ్డి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వేముల రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొన్నారు. ధాన్యం కుప్పలను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ధాన్యం కొనే దిక్కులేక రైతులు రూ. 2900 వదులుకొని కేవలం రూ.1700లకు దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

80 శాతం ధాన్యం కొనుగోలు చేశామని చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి కేవలం 30 శాతం మాత్రమే రెండు నెలలుగా కొనుగోలు చేశారని పేర్కొన్నారు. రెండు నెలలుగా మాల్తుమ్మెదలో కేవలం 34 లారీలు మాత్రమే వచ్చాయని, ఇంకా 67 శాతం ధాన్యం కేంద్రంలోనే ఉన్నదని తెలిపారు. ధాన్యం మొత్తం తరలించడానికి ఇంకా రెండు నెలల సమయం పట్టేలా ఉన్నదన్నారు. రెండు నెలలు గడుస్తున్నా వడ్లను తూకం చేయడంలేదని, కాంటా చేసినా ధాన్యం బస్తాలు కేంద్రం నుంచి తరలించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల ఉసురు తప్పకుండా తగులుతుందన్నారు.

రైతు నుంచి కేవలం ధాన్యం సేకరించిన ప్రభుత్వం చేతకాని ప్రభుత్వమని మండిపడ్డారు. అకాల వర్షాలకు ధాన్యం బస్తాలు తడిసిపోయి మొలకలు కూడా వస్తున్నాయన్నారు.లారీలు రాక, ధాన్యం తూకం వేయక రైతులతో ప్రభుత్వం ఆడుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# ఎన్నికల హామీలు అమలు చేయాలి




**ముద్ర, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.నాలుగు వేల పింఛన్ ఇవ్వాలని బీడీ కార్మికులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి, నవీపేట మండల కేంద్రాల్లో శనివారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఎడపల్లిలో ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ మాట్లాడుతూ.. బీడీ కార్మికులకు పీఎఫ్ కట్‌ఆఫ్ డేట్ తొలగించి అర్హులందరికీ పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో శంకర్‌నాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాలేరు గంగాధర్, భాగ్య గంగా, లక్ష్మి , సుజాత, రమ, సునంద, బీడీ కార్మికులు పాల్గొన్నారు. నవీపేట పంచాయతీ కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు డి.రాజేశ్వర్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డి.రాజేశ్వర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీడీ కార్మికులకు ప్రతి నెలా రూ.2,016 జీవన భృతి అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు పింఛన్ పెంచలేదని పేర్కొన్నారు.

# 1.5 శాతం వేతనం కోతపై ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు ఖరారు కాకుండానే మే నెల వేతనాల్లో 1.5 శాతం కోత విధించడంపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కోత విధించడం తీవ్రం అభ్యంతరకరమని ఖండించారు. హాస్పిటల్స్ తో ఒప్పందం కుదిరింది లేదు. ప్యాకేజి రేట్లు నిర్ణయించలేదు. డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వనేలేదు. ఈహెచ్ఎస్ చందా 1.5 శాతం మినహాయింపుపై జీఓ ఇవ్వలేదని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎల్.మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నందారం రఘుబాబు, నరేందర్ రెడ్డి, సుభాష్ రెడ్డిలు పేర్కొన్నారు. హెల్త్ కార్డుల గురించి విధివిధానాలు ప్రకటించక ముందే ఉద్యోగ, ఉపాధ్యాయులు 1.5 శాతం డిడక్షన్ చేయడం చాలా దారుణమన్నారు. ఆర్థిక శాఖ తీసుకున్న ఏకపక్ష నియంతృత్వ నిర్ణయాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలవుతుందని హెచ్చరించారు.

**టీపీటీఎఫ్ ఖండన..**

దొడ్డిదారిన ఉద్యోగుల వేతనం నుంచి 1.5 శాతం మినహాయింపు చేయడాన్ని టీపీటీఎఫ్ తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వం ఎంప్లాయిస్ ఆరోగ్య పథకం కోసం ఉద్యోగుల మే వేతనం నుంచి 1.5 శాతం మినహాయిస్తూ పేస్లిప్స్ జనరేట్ చేశారని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంగోటి యాదగిరి, ప్రధాన కార్యదర్శి పట్లోరి వెంకట్ రాం రెడ్డి తెలిపారు. ఆరోగ్య పథకానికి సంబంధించి విధివిధానాలు రూపొందించకుండా, కనీసం డ్రాయింగ్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం రాష్ట్రంలోని ఏ హాస్పిటల్స్ లో ఈ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తున్నారనే స్పష్టత లేకుండా ఏలా కోత విధిస్తారని ప్రశ్నించారు. భార్యాభర్తలు ఉద్యోగులైన సందర్భాల్లో, తల్లిదండ్రులు ఉద్యోగులైన సందర్భాల్లో, వేతన మినహాయింపులు ఏ విధంగా చేస్తారనే నిబంధనలు రూపొందించకుండానే ప్రతి ఉద్యోగి నుంచి మినహాయింపు చేశారని పేర్కొన్నారు. ఇది అక్రమమైన చర్యగా భావిస్తున్నామన్నారు. 1.5 శాతం వేతనాన్నీ ఉద్యోగుల ఆకౌంటుకు వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. అసంబద్ధ విధానాల పైన టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు తప్పవని హెచ్చరించారు.

**ఎస్టీయూ ఆగ్రహం..**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రవేశ పెట్టే ఎంప్లయ్ హెల్త్ స్కీం ఎటువంటి ఉత్తర్వులు, ముందస్తు సమాచారం లేకుండా మే జీతం నుంచి 1.5 శాతం హెల్త్ కార్డ్ పేరుతో మినహాయించడం సరైనది కాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చించి విధి విధానాలు రూపొందించిన తరువాత తగ్గింపు చేయాలని డిమాండ్ చేశారు.

# ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థుల ఎంపిక





**ముద్ర ప్రతినిధి, మెదక్:** హవేలీ ఘనపురం మండల పరిధిలోని కూచన్ పల్లి పీఎం శ్రీ ఉన్నత పాఠశాలకు చెందిన రవితేజ, బాసర దివ్య ట్రిపుట్ ఐటీకి ఎంపికయ్యారని ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాచారం మధుమోహన్ తెలిపారు. ఇద్దరు విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో ప్రతిరోజు కష్టపడి బాసర ట్రిపుట్ ఐటీలో సీటు పొందారన్నారు. వాళ్ల విద్యాభ్యాసం ఉన్నత స్థాయిలో కూడా మంచి స్థానంలో ఉండాలని ఆకాం క్షించారు. విద్యార్థులను పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శివరాజ్, ఉపాధ్యాయులు సందీప్ కృష్ణ, మల్లారెడ్డి, పంతంగి శ్రీనివాస్, కొండల్ రెడ్డి తదితరులు అభినందించారు.

# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం



**ముద్ర, హైదరాబాద్:** ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం రెండు రోజుల్లో తూకం వేయకుంటే రణ రంగం సృష్టిస్తామని స్పష్టం చేశారు. రెండు నెలులు గడుస్తున్నా రైతుల ధాన్యం తూకం వేయడం లేదని, కాంటా చేసినా ధాన్యాన్ని కేంద్రం నుంచి తరలించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండంలోని గోలీలింగాల్,జలాల్‌పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. రైతుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయాలని ప్రభుత్వం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి కష్టమూ రాకుండా, రైతును రాజులా చూసిందన్నారు. ధాన్యం తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. అకాల వర్షం కారణంగా ధాన్యం బస్తాలు తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అత్యధికంగా వడ్లు పండించే మండలం నాగిరెడ్డిపేట్ అని పేర్కొన్నారు. ప్రజా పాలన పేరుతో రైతులను కాంగ్రెస్ ప్రభత్వం మోసం చేస్తున్నదని మండిపడ్డారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కేవలం సోషల్ మీడియాకే పరిమితమయ్యాడని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించిన దాఖలాలులేవన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలు పంపించి, ధాన్యాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. జాజాల వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్ధయ్య, సొసైటీ చైర్మన్ నర్సింహులు, మాజీ చైర్మన్ రాజరెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి,మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ వంశీగౌడ్ పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com